PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 144 | విజయవాడ, గురువారం 26 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 26 December 2024 | Rs

ఓపెనర్‌గా రోహిత్ శర్మ

- నేటినుంచి బాక్సింగ్ డే టెస్టు
- ఉ. 5.00గం॥లకు ప్రారంభం

6

వాటికన్‌సిటీలోని సెయింట్ పీటర్స్ బాలిసికా బాల్కనీ నుంచి శాంతి సందేశాన్ని వినిపిస్తున్న పోప్ ఫ్రాన్సిస్

5

సంతలపై దాడి

మోడీ సర్కార్ మరో నిర్వాకం

- గ్రామీణ మార్కెట్లుగా మార్పు
- ఆధునీకరణ పేరిట కార్పొరేట్ల హస్తగతం
- జాతీయ ఏకీకృత మార్కెట్ విధానంలో దుర్మార్గం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

అనాదిగా గ్రామాల్లో నిర్వహించే సంతలపై మోడీ ప్రభుత్వ కన్ను పడింది. వాటిని క్రమేపి ప్రైవేటీకరించేందుకు, కార్పొరేట్ల హస్తగతం చేసేందుకు బిజెపి సర్కార్ పన్నాగం పన్నింది. దేశ వ్యాప్తంగా అసంఘటిత రంగంలో పల్లెల్లో వేల సంఖ్యలో నడుస్తున్న సంతలను అగ్రి బిజినెస్ సెంటర్లుగా మారుస్తామని 'జాతీయ ఏకీకృత మార్కెట్ విధానం' పేరిట రూపొందించిన ఫ్రేమ్ వర్క్‌లో స్పష్టం చేసింది. రాష్ట్రాలకు పంపిన పాలసీ ముసాయిదాలో సంతలకు సంబంధించి దుర్మార్గమైన ప్రతిపాదనలు చేసింది. ఏజెన్సీలో నిర్వహించే సంతల దగ్గర నుంచి మైదాన ప్రాంతాల్లో నడిచే సంతల వరకు అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంది. ఇటువంటి సంతలను గ్రామీణ హాట్‌లుగా పేర్కొంది. రైతులు, వ్యవసాయ కార్మికులు సంతలకు తమ ఉత్పత్తులను తీసుకొచ్చి అమ్ముకోవడం సంప్రదాయంగా వస్తోంది. సంతల వలన బహుళజాతి సంస్థల ప్రొడక్ట్స్ మార్కెట్‌కు, సదరు వస్తువులకు గిరాకీ లేకుండా పోతోందని బాధ పడుతున్న మోడీ సర్కారు, సంతలను మార్కెట్ చట్రంలో బంధించే ఎత్తు వేసింది. విలువ ఆధారిత గొలుసు, రైతుల ఆదాయాల పెంపు వంటి తీపి మాటలు వల్లించింది.

విలువ ఆధారిత గొలుసు చట్రంలోకి

కేంద్ర సర్కార్ రూపొందించిన ఫ్రేమ్ వర్క్‌లో ఏమన్నదంటే... 'నిర్దిష్టమైన గణాంకాలు లభ్యం కానప్పటికీ అందుబాటులో ఉన్న సర్వేల ప్రకారం దేశ వ్యాప్తంగా 22,931 సంతలు నడుస్తున్నాయి. అత్యధికం వారాంతపు సంతలే. రెండు వారాలకోసారి, మూడు వారాలకోసారి నిర్వహించే సంతలు కూడా ఉన్నాయి. నిర్వహిస్తున్న సంతల్లో 63.25 శాతం స్థానిక సంస్థల నియంత్రణలో నడుస్తున్నాయి. ప్రైవేటు నియంత్రణలో 28.93 శాతం, వ్యవసాయ మార్కెట్ కమిటీల (ఎఎంసి) కింద 2.11 శాతం, ఇతరుల కంట్రోల్‌లో 5.71 శాతం నడుస్తున్నాయి. సంతల నిర్వహణకు సరైన మౌలిక సదుపాయాలు, ఉత్పత్తులకు ధరల నిర్ణయం వంటివి వ్యవస్థీకృతంగా లేవు. అందువలన అటు ఉత్పత్తిదారులైన రైతులకు మంచి ధర రావట్లేదు. ఇటు వినియోగదారులు అధిక ధరల వలన నష్టపోతున్నారు. ఇటువంటి సంతలను రానున్న కాలంలో దశల వారీగా అన్ని మౌలిక వసతులతో కూడిన గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా తీర్చిదిద్దాలి. ఆర్థిక పరిపుష్టితో పాటు సాంకేతికంగా అభివృద్ధి చేయాలి. మార్కెట్ గొలుసులోకి తీసుకురావాలి.' అని పేర్కొన్నారు. గ్రామీణ వ్యవసాయ మార్కెట్లలో ఉత్పత్తుల నిల్వకు అవసరమైన అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేయనున్నట్లు, త్వరగా పాడైపోయే ఉత్పత్తుల నిల్వకు (పండ్లు, పూలు వంటివి) అవసరమైన ఫ్రిజ్‌ల వంటి వాటిని అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.

ఏడాదికి 300

ఏ ప్రాంతంలో ఎన్ని సంతలను ఏ సమయానికి గ్రామీణ మార్కెట్‌లుగా మార్చాలో కూడా టార్గెట్లు నిర్ణయించారు. సంవత్సరానికి మిగతా 2లో

ప్రధాని మోడీకి బొకే అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు

'మిట్టల్'కు ముడి ఖనిజం

- ప్రధానికి చంద్రబాబు విజ్ఞప్తి
- కేంద్ర మంత్రి వద్ద విశాఖ ఉక్కు ప్రస్తావన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రితో ఆయన నివాసంలో చంద్రబాబు బుధవారం సమావేశమయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మిట్టల్ స్టీల్‌ప్లాంటు విషయాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న ఈ స్టీల్ పరిశ్రమకు ఖనిజాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన అనుమతులను సాధ్యమైనంత త్వరగా వచ్చేలా చూడాలని ప్రధానిని ఆయన కోరారు. సాంకేతిక ఇబ్బందులు తొలగితే ప్రాజెక్టు వేగంగా పట్టాలు ఎక్కుతుందని, దీనికోసం సహకరించాలని ప్రధానికి సిఎం విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికులు చేస్తున్న ఆందోళనను, వారి విజ్ఞప్తులను ప్రధాని దృష్టికి తీసుకుపోయే విషయాన్ని ముఖ్యమంత్రి విస్మరించారు. విశాఖ ఉక్కు కార్మికుల ఆందోళనలో ముడి ఖనిజం అంశం కూడా భాగమన్న సంగతి తెలిసిందే. ముడి ఖనిజం నిరంతర సరఫరా కోసం విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్రత్యేకంగా గనులు కేటాయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు స్పందించలేదు. ఇంకా ఏర్పాటుకాని, ప్రైవేటు పరిశ్రమైన మిట్టల్ స్టీల్ ప్లాంటు తరపున రాష్ట్ర ముఖ్యమంత్రే ఈ విషయాన్ని నేరుగా ప్రస్తావించడం గమనార్హం. ప్రధాని వద్ద విశాఖ ఉక్కు ఊసు ఎత్తని ముఖ్యమంత్రి కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో మాత్రం ఈ విషయం ప్రస్తావించారని సిఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ బలోపేతం చేసే అంశంపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రత్యేక సాయం కింద ఆర్థిక సాయం

గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఐదేళ్లకు రావాల్సిన రెవెన్యూ డెఫిషిట్ గ్రాంట్‌ను మూడేళ్లలోనే వాడేసిందని ప్రధానికి సిఎం తెలిపారు. ప్రత్యేక సాయం కింద ఆర్థిక సాయం చేయాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి ఎపి ప్రభుత్వం విడుదల చేసిన స్వర్ణాంధ్ర విజన్ 2047ను ప్రధానికి అందజేశారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా తమ వంతుగా రాష్ట్రం నిర్దేశించుకున్న లక్ష్యాలను, వాటిని చేరుకునేందుకు మిగతా 2లో

శ్రీతేజ్ కుటుంబానికి రూ.రెండు కోట్ల సాయం

- ప్రకటించిన అల్లు అరవింద్

2

వలంటీర్లకు ఉద్యోగ భద్రత

- సిపిఎం డిమాండ్
- ముఖ్యమంత్రికి లేఖ

మనుస్మృతి మానవాళికి మరణ శాసనం

- మనువాద జాడ్యంతోనే అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా
- దేశవ్యాప్తంగా మనుస్మృతి ప్రతుల దగ్ధం

5

శతజయంతి సందర్భంగా వాజ్‌పేయికి ఘన నివాళి

- అటల్ సార్మక చిహ్నాన్ని సందర్శించిన రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతులు

న్యూఢిల్లీ : మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఆయనకు రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతులు ఘనంగా నివాళులర్పించారు. న్యూఢిల్లీలోని సదైవ్ అటల్ సార్మక చిహ్నం వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పూల మాలలు వేసి నివాళులర్పించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శతజయంతి సందర్భంగా ప్రధాని మోడీ వాజ్‌పేయిపై ప్రత్యేక వ్యాసం రాస్తూ, 21వ శతాబ్దంలో భారత దేశ పరివర్తనకు రూపశిల్పిగా కొనియాడారు.

నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ, చిత్రంలో అమిత్ షా, చంద్రబాబు తదితరులు

అమిత్ షా వ్యాఖ్యలపై ఎన్‌డిఎలో చర్చ

అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఎన్‌డిఎ పార్టీలు బుధవారం తీవ్రంగా చర్చించాయి. వాజ్‌పేయి జయంతి సందర్భంగా బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా నివాసంలో ఎన్‌డిఎ సమావేశం జరిగింది. వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఈ అంశం నుండి ఎలా బయటపడదామని ఈ సమావేశంలో ఎన్‌డిఎ పక్షాలు సమాలోచన చేశాయి. సమావేశంలో బీహార్‌లోని జెడియు, హెచ్‌ఎఎం వంటి పార్టీలు అమిత్ షాను బహిరంగంగా ప్రశ్నించకపోయినా, లోలోపల మాత్రం విముఖత వ్యక్తం చేశాయి. అయితే ఈ అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఎన్‌డిఎ పక్షాలకు అమిత్ షా నిర్దేశించారు. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జెడియు నేత, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, అప్నాదళ్ అధ్యక్షులు, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్, జెడిఎస్ నేత, కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి, టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, హిందుస్థానీ అవామ్ మోర్చా (ఎస్) నాయకుడు మిగతా 2లో

అమిత్ షా రాజీనామా కోసం 30న రాష్ట్రవ్యాప్త నిరసనలు

- వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలపాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. జాతీయ నిరసన దినంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసి నాయకులు వై.సాంబశివరావు, సిపిఐ (యంఎల్) నాయకులు జాస్తి కిషోర్‌బాబు, యంసిపిఐ (యు) నాయకులు కాటం నాగభూషణం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఎన్.మూర్తి, సిపిఐ (యంఎల్) న్యూడెమొక్రసి నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వరు, ఎస్‌యుసిఐ (సి) నాయకులు బిఎస్ అమర్‌నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నాయకులు జానకి రాములు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల

చేశారు. అంబేద్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళి చేస్తూ, 'అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, అదే ఏదో ఒక దేవుడిని తలుచుకుంటూ జపం చేస్తే స్వర్గానికి వెళ్లే అవకాశం వస్తుందంటూ' అమిత్‌షా చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా ప్రధాని మోడీ ఆయన్ను వెనకేసుకురావడం భారతీయులకు తలవంపని పేర్కొన్నారు. అన్ని తరగతులు, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజాసంఘాలు 30వ తేదీన జరిగే నిరసన కార్యక్రమాలకు మద్దతునిచ్చి, పాల్గొనాలని వామపక్షాలు విజ్ఞప్తి చేశాయి.

కొత్త నియామకాలు 21 శాతం పతనం

- ఏడు నెలల కనిష్టానికి ఉద్యోగ కల్పన : ఇపిఎఫ్ఒ

న్యూఢిల్లీ : దేశంలో ఉద్యోగ కల్పన అమాంతం పడిపోయిందని స్వయంగా ప్రభుత్వ సంస్థల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో సంఘటిత రంగంలో కొత్త నియామకాలు 20.8 శాతం తగ్గాయని, 7.50 లక్షలకు క్షీణించాయని ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సంస్థ (ఇపిఎఫ్ఒ) తన నెలవారీ డేటాలో వెల్లడించింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో కొత్తగా 9.47 లక్షల నియామకాలు జరిగాయి. అక్టోబర్‌లో ఉపాధి కల్పన భారీగా తగ్గి.. ఏడు నెలల కనిష్టానికి చేరింది. ఇందులోని మొత్తం చందాదారుల్లో 18-25 ఏళ్ల వయసు వారు 4,38,700 మందితో 58.5 శాతంగా ఉన్నారు. ఈ వయసు వారి నియామకాలు సెప్టెంబర్‌లో 5,67,700 మందితో 59.94 శాతంగా నమోదైంది. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారిలో 2.09 లక్షల మంది మహిళలు ఉన్నారు. మొత్తం అవకాశాల్లో మహిళల వాటా 27.9 శాతంగా ఉంది. అక్టోబర్‌లో నికరంగా చందాదారుల సంఖ్య 5 శాతం తగ్గి 13.4 లక్షలకు పరిమితం కాగా.. ఇంతక్రితం సెప్టెంబర్‌లో 14.1 లక్షలుగా నమోదైంది. అక్టోబర్ నెలలో ఇపిఎఫ్ఒను వీడి మళ్లీ చేరిన వారి సంఖ్య 12.90 లక్షలుగా ఉంది.

10న ఎస్‌సి కులగణన సర్వే తుది జాబితా

- గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులోకి
- షెడ్యూల్‌ను ప్రకటించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సి కుల గణన (సామాజిక, ఆర్థిక, విద్య) పై గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో చేపట్టిన సర్వే డేటా తుది జాబితాను జనవరి 10న ప్రభుత్వం అధికారికంగా వెల్లడించనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. కులగణన సర్వే జాబితాను ఈనెల 26న గ్రామ, వార్డు సచివాలయాల నోటీస్ బోర్డుల్లో ప్రదర్శిస్తారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 26 నుంచి 31 వరకు ఫిర్యాదులు చేసేందుకు ప్రభుత్వం ప్రజలకు అవకాశమిచ్చింది. ఈనెల 26 నుంచి జనవరి 6 వరకు అభ్యంతరాలపై ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చు. వాటిని కూడా పరిశీలించిన అనంతరం ఎస్‌సి కులగణన తుది జాబితాను జనవరి 10న ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రకటిస్తారు. అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులను తొలుత గ్రామ వార్డు సచివాలయాలకు సంబంధించి విఆర్ఓ / విఆర్ఎస్, పంచాయతీ సెక్రటరీ/ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ స్వీకరిస్తారు. అనంతరం పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత వ్యక్తులకు రశీదు ఇవ్వాల్సి ఉంటుంది. గ్రీవెన్స్‌కు సంబందించిన విచారణ అనంతరం నివేదికను రెవెన్యూ ఇనెస్పెక్టర్స్‌కు సమర్పించాల్సి ఉంటుంది. భవిష్యత్తు అవసరాల కోసం గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తుల వివరాలను, రికార్డులను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలి. ఈ ప్రక్రియను పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీల కోసం టాస్క్‌ఫోర్స్‌ను ఆయా జిల్లాల కలెక్టర్లు ఏర్పాటు చేయాలి. కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాల్లో జాబితాను ప్రదర్శించాలి.

జిల్లా కలెక్టర్లు నియోజవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించాల్సి ఉంటుంది. ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహించి కలెక్టర్లకు ఫీడ్ బ్యాక్ ఇవ్వాల్సిఉంటుంది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు సాఫ్ట్‌వేర్, యాప్‌లను సిద్ధంగా ఉంచాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

కజకిస్తాన్‌లో కూలిన విమానం

- 30 మందికిపైగా మృతి

మాస్కో : అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 67 మంది ప్రయాణికులతో వెళ్తుండగా కజకస్తాన్ నగరమైన అక్టౌలో బుధవారం కూలిపోయింది. ఈ ప్రమాదంలో 30 మందికి పైగా ప్రయాణికులు మరణించారు. ప్రమాద సమయంలో విమానంలో ఐదుగురు సిబ్బందితో సహా 67 మంది ఉన్నారని కజకస్తాన్ అత్యవసర వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటివరకు నాలుగు మృత దేహాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం చనిపోయినవారిలో ఇద్దరు విమాన పైలట్లు కూడా ఉన్నారు. అక్టౌ నగరానికి 3కిలోమీటర్ల దూరంలో విమానం అత్యవసరంగా దిగిందని అంతకుముందు అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. అజర్‌బైజాన్ రాజధాని బాకూ నుండి బయలుదేరిన ఈ విమానం రష్యా నగరమైన గ్రోజ్నీకి వెళ్ళాల్సి వుంది. ప్రయాణికుల్లో 37 మంది అజర్‌బైజాన్ పౌరులు కాగా, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజక్ జాతీయులు, ముగ్గురు కిర్గిస్తాన్ జాతీయులు వున్నారని ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. అగ్నిగోళంలా మిగతా 2లో

అడుగడుగునా కాంట్రాక్టీకరణ!

- విశాఖ ఉక్కు విభాగాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం, యాజమాన్యం
- రూ.1,060 కోట్ల కార్మికుల బకాయిలతోనే 'ఉక్కు' నడక
- 'టిడిపి కూటమి' పాలకుల తీరుపై ఎగసిపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కును సంపూర్ణంగా పీకనులిమేసే చర్యలకు అటు కేంద్రంలోని బిజెపి, ఇటు ప్లాంట్ యాజమాన్యం ముమ్మరం చేశాయి. ఉక్కు గెస్ట్ హౌస్, ఆక్సిజన్ ప్లాంట్, ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, సిఐఎస్‌ఎఫ్ సిబ్బందినంతటినీ క్రమంగా తొలగించే కుట్రలతో పూర్తి స్థాయిలో ప్రైవేటీకరణ చర్యలకు కేంద్రంతో కలిసి స్టీల్ యాజమాన్యం ఒడిగట్టింది.



ఇప్పటికే ప్లాంట్‌లోని పలు విభాగాల్లో ఉద్యోగుల కోతకు ఆదేశాలు జారీ చేసి చాప కింద నీరులా అమలు చేయడంతో కార్మికులు, ఉద్యోగుల్లో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సిఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన నడిచే ఫైర్ వింగ్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టే చర్య యాజమాన్య దుందుడుకుతనానికి తాజా తార్కాణం. స్టీల్‌ప్లాంట్ పరిధిలో 15 కిలోమీటర్లలోపు ఎక్కడ ప్రమాదం జరిగినా ఈ ఫైర్ సిబ్బందే వెళ్లడం ఆనవాయితీ. తాజా చర్యతో 253 మంది ఫైర్ సిబ్బంది రోడ్డున పడ్డారు.

ఉక్కు 'ప్రై'వేటు ఇలా....

స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల్లో పాత టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లు ఇచ్చినప్పుడు లేదా రెన్యువల్ చేసినప్పుడు ప్రతి విభాగంలో 30 శాతం కాంట్రాక్టు వర్కర్లను తొలగించాలని నిబంధన యాజమాన్యం తాజాగా విధించింది. దీంతో, ఇప్పటికే 700 మంది వీధినపడ్డారు. టోటల్ మెయింటెనెన్స్ కాంట్రాక్టు (టిఎంసి) అమలు చేసి కోకోఓవెన్ బ్యాటరీలను ప్రైవేట్‌కు క్రమంగా కట్టబెట్టేస్తోంది. ఎయిర్ సెపరేషన్ ప్లాంట్ నిర్మాణాన్ని ప్రైవేట్ (లండన్ కంపెనీ)కి ఇచ్చేసింది. స్టీల్‌ప్లాంట్ లోపల ఉత్పత్తయ్యే డస్ట్‌ను కలెక్ట్ చేసి పెల్లెట్స్, బ్రిక్‌లెట్స్ తయారీ కోసం ప్రైవేట్‌కి తాజాగా కట్టబెట్టింది. దీన్ని వారు తీసుకెళ్లి పెల్లెట్స్, బ్రిక్‌లెట్స్ తయారు చేసి మళ్లీ ప్లాంట్‌కే అమ్మే ఆపరేషన్‌ను యాజమాన్యం అమలు చేస్తోంది. స్టీల్‌ప్లాంట్‌లో గుర్తించిన ఇతర ఉద్యోగులు 500 మందిని ప్రభుత్వరంగ సంస్థలకు పంపించేయాలని, విఆర్‌ఎస్ ఇచ్చి 2,500 మందికి ఉద్వాసన పలకాలని తాజాగా చూస్తోంది. ప్రతి టెండరులోనూ 30 శాతం కాంట్రాక్టు వర్కర్లను తగ్గించేయాలని నిబంధన తాజాగా పెట్టడంతో నాలుగు వేల మంది ఉపాధి కోల్పోనున్నారు ఆస్పత్రిలో పర్మినెంట్ సిబ్బంది, డాక్టర్లను నియమించకుండా కాంట్రాక్టు వాళ్లను పెట్టుకుంటోంది. స్టీల్‌ప్లాంట్‌లో టిఎంసి విధానం పెట్టి మ్యాన్ పవర్‌కు కోత పెడుతున్నారు. దీంట్లో భాగంగా రా మెటీరియల్ హేండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పి)లో తాజాగా 12 మంది ఉపాధి కోల్పోయారు.

కార్మికుల బకాయిల సొమ్ముతోనే నడక!

కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. పైపెచ్చు వీరి తరపున పిఎఫ్, మిగతా 2లో

బిసిల పక్షపాతి చంద్రబాబు

- మంత్రి సవిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబు.. బిసిల పక్షపాతి అని నిరూపించుకున్నారని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. బిసిల ఫెడరేషన్లు ఏర్పాటుచేసిన ఘనత ఎన్‌టిఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్‌టిఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని చంద్రబాబు బిసిలకు పెద్దపీట వేశారన్నారు. వైసిపి హయాంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేశారే కానీ నిధులు కేటాయించలేదన్నారు. తమ ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు, విధులు కేటాయించిందన్నారు. సిఎం ఆదేశాల మేరకు సీడ్ యాప్ ద్వారా పది వేలమందికి ఉపాధి చూపబోతున్నామని మంత్రి వెల్లడించారు. పౌల్ట్రీ, సీ ఫారమ్స్, మెడికల్ స్టోర్స్, ఫుడ్ ప్రాసెస్ యూనిట్స్‌లో యువతకు ట్రైనింగ్ ఇచ్చి వారు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ కూడా ప్రభుత్వమే చేసే విధంగా ప్రణాళిక రచించామన్నారు. ఈ కార్యక్రమం గురించి సీడ్ ఛైర్మన్ దీపక్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు.

దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కూచివారిపల్లిలో చెట్టుకు ఉరేసుకుని దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..రామిరెడ్డిపల్లి పంచాయతీ కూచువారిపల్లికి చెందిన దంపతులు సురేందర్ నాయుడు (50), లత (45) తిరుపతిలో నివసిస్తున్నారు. వీరికి వివాహమైన ఇద్దరు కుమార్తెలున్నారు. తిరుపతి ట్రాన్స్‌కోలో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా సురేందర్‌నాయుడు పని చేస్తున్నారు. దంపతులిద్దరూ తిరుపతి నుంచి తమ సొంత గ్రామమైన కూచివారిపల్లెకు వచ్చారు. తమ పొలంలోని చెట్టుకు ఉరేసుకున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

అడుగడుగునా కాంట్రాక్టీకరణ!

మొదటిపేజి తరువాయి

పెన్షన్, ఇన్స్యూరెన్స్, త్రిఫ్ట్ ఖాతాలకు డబ్బు రూ.1,060 కోట్లను (12 వేల మంది కార్మికుల బకాయిలను) యాజమాన్యం ఉక్కు ఫ్యాక్టరీని నడిపేందుకు వాడేస్తోంది. దీనిపై తాజాగా ప్లాంట్‌లో కార్మికుల్లో ఆందోళన నెలకొంది. కూటమి పాలకులైన టిడిపి, జనసేన, బిజెపి నేతలు పల్లెత్తి మాట్లాడడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 243 మంది కార్మికులు ఉన్న కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య ఉక్కు ఫ్యాక్టరీకి రూ.15 వేల కోట్ల ప్యాకేజీనికేంద్ర ఉక్కు శాఖ ఇచ్చింది. వేల సంఖ్యలో కార్మికులు ఉన్న విశాఖ ఉక్కుపై మాటలతోనే సరిపెట్టడంతో కార్మికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ ప్రాంత ఎంపీలు హస్తినకుపోయి రావడం తప్ప, ఏం సాధించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

నత్తనడకన బందరు పోర్టు నిర్మాణం

- డ్రెడ్జింగ్ చేయాల్సినది 46.61 మిలియన్ క్యూబిక్ మీటర్లు
- పూర్తయింది 7 క్యూబిక్ మీటర్లు మాత్రమే

బందరు పోర్టులో జరుగుతున్న నిర్మాణ పనులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

బందరు పోర్టు నిర్మాణాన్ని వేగవంతం చేశామని, 2025 అక్టోబర్ నాటికి పోర్టుకు ఓడను తీసుకొస్తామని ప్రజాప్రతినిధులు చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన కుదరడం లేదు. మొత్తం పనుల్లో ఇప్పటికి 25 శాతం మాత్రమే పూర్తవ్వడంతో గడువులోపు పోర్టు నిర్మాణ పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ నిర్మాణ పద్ధతుల్లో ప్రభుత్వమే నిధులు వెచ్చించి నిర్మిస్తోన్న ఈ పోర్టు టెండరును మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) నిర్మాణ సంస్థ దక్కించుకుంది. 2023 ఏప్రిల్ 21న మారిటైం బోర్డుతో ఒప్పందం కుదుర్చుకుంది. 2025 అక్టోబర్ నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా, ఆ దిశగా పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టు సంస్థ 30 నెలల్లో పోర్టు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా, గడువులో 21 నెలలు పూర్తయ్యాయి. మొత్తం రూ.3,668 కోట్ల విలువైన పనుల్లో రూ.867 కోట్ల పనులు మాత్రమే పూర్తి చేసింది. చేయాల్సిన, పూర్తయిన పనులు పరిశీలించినప్పుడు పోర్టు నిర్మాణం నత్తనడకన సాగుతోందని తేటతెల్లం అవుతోంది. పోర్టు నిర్మాణ డిజైన్లకు ఐఐటి మద్రాస్ నుంచి ఆమోదం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని. ఈ పరిస్థితుల్లో పోర్టు నిర్మాణ గడువు పొడిగించాల్సి ఉంటుందని ఇప్పటికే కాంట్రాక్టు సంస్థ మెగా మారిటైం బోర్డుకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

25 శాతం పనులే

పోర్టు నిర్మాణంలో 25 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మొదటి దశలో నాలుగు బెర్త్‌లు నిర్మించాలి. బెర్త్‌లకు 1,200 పైళ్లకు వెయ్యి మాత్రమే ఏర్పాటయ్యాయి. 2,800 మీటర్లు సముద్రంలోకి ఉత్తర, దక్షిణ బ్రేక్ వాటర్‌లు ఏర్పాటు చేయాలి. మూడు దశలకుగానూ ఒక దశలో 500 కిలోల బరువైన రాళ్లను మాత్రమే పేర్చారు. ఆ తర్వాత దశల్లో వెయ్యి కిలోల బరువు (టన్ను) రాళ్లను పేర్చి అవి కదలకుండా టెట్రాపాట్‌లు అమర్చాలి. కార్గో కంటైనర్ నిల్వలకు 500 ఎకరాల్లో గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు జరుగుతున్నాయి. దీనిలోనే గోదాములు నిర్మించాల్సి ఉంది. మూడు వైపులా పది కిలోమీటర్ల ప్రహరీకిగానూ నాలుగు కిలోమీటర్లు నిర్మించారు. నాలుగు బెర్త్‌ల మీదకు ఓడలు రావడానికి వీలుగా ఛానల్ ఏర్పాటులో భాగంగా 46.61 మిలియన్ క్యూబిక్ మీటర్లు మట్టి తొలగించాల్సి ఉండగా, ఏడు మిలియన్ క్యూబిక్ మీటర్లు మాత్రమే పూర్తయింది. మొత్తం గ్రౌండ్‌ను మూడు మీటర్ల ఎత్తు చేయాల్సి ఉంది. ఈ పనుల్లో 70 శాతం పూర్తయ్యాయి. బందరు గిలకల దిండి మంచినీటి కాలువ నుంచి నీటి సరఫరాకు 12 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు ఇటీవలే ప్రారంభించారు. పోర్టుకు విద్యుత్తు సరఫరాకు ఎపి ట్రాన్స్‌కో సర్వే పూర్తయింది. 21 నెలల్లో 25 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఈ క్రమంలో పోర్టు నిర్మాణం మరో రెండేళ్లకుగానీ పూర్తయ్యే పరిస్థితి లేదని నిపుణులు అంటున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను చంద్రబాబే పరిరక్షించాలి

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబే పరిరక్షించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 1413వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల ఎఐటియుసి ప్రతినిధులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ మాట్లాడారు. ప్రధానమంత్రితో ముఖ్యమంత్రి మాట్లాడి ప్లాంట్ పరిరక్షణకు, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు ముప్పు వాటిల్లకుండా త్వరితగతిన స్పందించాలని కార్మిక వర్గం కోరుకుంటూందన్నారు. గత ఆరు నెలలుగా ఉత్పత్తి రోజురోజుకు పెరుగుతూ సాధారణ స్థితికి చేరువలో ఉన్నా ఉద్యోగుల వేతనాలు మాత్రం చెల్లించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వినాయక చవితి, దీపావళి, క్రిస్మస్ తదితర ప్రధాన పండగల సమయంలో కూడా ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుండా ఆర్థికంగా కుంగదీసి కార్మికుల మానసిక ధైర్యం దెబ్బతీయడం తగదన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతీస్తూ యాజమాన్యం ద్వారా కేంద్రం, అమలుచేస్తోన్న ఆంక్షలు నిలిపివేయాలని కోరారు. నిర్వాసితుల ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని, కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాటు విద్యుత్, నీటి బిల్లులు వాయిదా వేయాలని, స్టీల్‌ప్లాంట్ భూములను ఆర్ఐఎన్ పేరున ట్రాన్స్‌ఫర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తికి కావాల్సిన రా మెటీరియల్, కొనుగోలు, తయారైన ఉత్పత్తుల అమ్మకాలలో జరుగుతున్న అవకతవకలపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేయాలని, రైల్వే రేకులు సకాలంలో అందేలా కేంద్రం దృష్టి సారించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ పూర్వ వైభవం దిశగా నడిచేందుకు కేంద్ర ఆర్థిక శాఖపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎంఎల్.నాయుడు, కొణతాల శ్రీను, ఎస్‌సిఎస్ఎన్.మూర్తి, పి.అప్పారావు, సాయిరాం, బాబూరావు, మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

1న నామినేటెడ్ పోస్టుల జాబితా

- తుది దశకు చేరిన కసరత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల జాబితాను నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న విడుదల చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ప్రభుత్వం ఇప్పటికి రెండు జాబితాలు ప్రకటించగా, తాజాగా ప్రకటించనున్న మూడో జాబితా జంబోజెట్ తరహాలో అత్యధిక ఛైర్మన్ పోస్టులను భర్తీ చేసే విధంగా ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికి భర్తీ చేయని కుల సంఘాల ఛైర్మన్లు, దేవాలయాల పాలకమండళ్ల ఛైర్మన్లు, సభ్యుల నియామకాలకు కూడా జాబితాలో స్థానం కల్పించనున్నట్లు తెలిసింది. నియోజకవర్గాల స్థాయిలో మార్కెట్ కమిటీలకు ఈ నెలాఖరులోగా జాబితాను ఫైనల్ చేసే అవకాశముంది. ఒక వేళ అనుకోని కారణాలతో ఆలస్యమైతే ముక్కోటి సందర్భంగా జనవరి 9న జాబితా ప్రకటించే అవకాశమున్నట్లు తెలిసింది. ఈ సారి జాబితాలో మార్కెట్ కమిటీలు, సహకార సంస్థలు, రాష్ట్ర సహకార బ్యాంకు పాలక మండళ్లు, మత్స్యకార సొసైటీలు, ఆప్కాబ్ ఛైర్మన్ లాంటి పదవులు కూడా ఉంటాయని సమాచారం. జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయి పదవులను ఆయా ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులు సిఫారసు చేసిన వారికి కట్టబెట్టే యోచనలో కూటమి పార్టీ అగ్రనేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ పోస్టుల్లో 34 శాతం బిసిలకు కట్టబెట్టనున్నట్లు తెలిసింది.

ఆ పథకాల్లేవు

- ఆప్ ప్రకటించిన రెండు పథకాలపై రెండు ప్రభుత్వ విభాగాల పబ్లిక్ నోటీసులు
- బిజెపి ఒత్తిడితోనే ఇదంతా.. : ఆప్

న్యూఢిల్లీ : ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నా కొద్దీ.. రాజకీయం మరింత వేడెక్కుతున్నది. ఇక్కడ అధికార ఆప్ ప్రకటించిన రెండు పథకాలు ఇప్పుడు చర్చకు దారి తీస్తున్నాయి. ఈ పథకాలేవి లేవనీ, ప్రభుత్వం వీటిని నోటిఫై చేయలేదనీ, తప్పుదారి పట్టించే పథకాల పట్ల జాగ్రత వహించాలంటూ ప్రజలను హెచ్చరిస్తూ ఢిల్లీలోని రెండు ప్రభుత్వ విభాగాలు పత్రికల్లో పబ్లిక్ నోటీసు యాడ్స్ ద్వారా వివరించాయి.

ఈ రెండు పథకాలు.. ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన. వీటి పైనే ఇప్పుడు ఢిల్లీలో చర్చ నడుస్తున్నది. అర్హులైన మహిళలకు నెలకు రూ.2100 అందించే పథకం మహిళా సమ్మాన్ యోజన. దీనికి సంబంధించి నమోదు ప్రక్రియను ఇటీవల ఆప్ అధినేత కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం అతిషి ప్రారంభించారు. ఇక, 60 ఏళ్లు పైబడినవారికి ఉచిత ఆరోగ్య సంరక్షణను కల్పించేది సంజీవని యోజన. ఈ రెండు పథకాలూ అమలులో లేవనీ, ఈ స్కీమ్‌లకు సంబంధించి ఎవరికీ వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదని హెచ్చరిస్తూ ఢిల్లీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, మహిళా, శిశు అభివృద్ధి విభాగాలు పబ్లిక్ నోటీసులను ప్రచురించాయి. ఈ రెండు పథకాలను కేజ్రీవాల్ అధికారికంగా ప్రకటించారని ఆప్ అంటున్నది. ద్వేషాన్ని నింపుకొని ఉన్న బిజెపి ఇప్పుడు మహిళలు, వృద్ధులనూ వ్యతిరేకిస్తున్నదని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్‌సింగ్ ఆరోపించారు. ఆ పార్టీ ఒత్తిడితోనే ప్రకటనలు వెలువడ్డాయనీ, అధికారులపై చర్యలుంటాయని వివరించారు.

ఈ విషయంపై కేజ్రీవాల్ ఎక్స్ వేదికగా స్పందించారు. రెండు పథకాల ప్రకటనతో బిజెపి విలవిలలాడుతున్నదని వివరించారు. "వారు ఒక కల్పిత కేసులో రానున్న రోజుల్లో అతిషిని అరెస్ట్ చేయాలని ప్లాన్ చేశారు. దానికి ముందు, సీనియర్ ఆప్ నేత ఇళ్లలో సోదాలు జరుగుతాయి" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

అక్కడ గౌరవం...ఇక్కడ ధ్వంసమా?

- ఇదో డ్రామా
- మోడీపై మండిపడిన కేరళ బిషప్
- క్రిస్మస్ తొట్టిని విహెచ్‌పి కార్యకర్తలు ధ్వంసం చేయడంపై ఆగ్రహం

చర్చిలో విహెచ్‌పి కార్యకర్తల వీరంగం

తిరువనంతపురం : కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా (సిబిసిఐ) న్యూఢిల్లీలో నిర్వహించిన క్రిస్టమస్ వేడుకలకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరు కావడాన్ని కేరళలోని మలంకర ఆర్థడాక్స్ సిరియన్ చర్చి సీనియర్ బిషప్ యుహానన్ మెలెటియస్ ఆక్షేపించారు. దీనిని ఆయన ఓ 'నాటకం'గా అభివర్ణించారు. విహెచ్‌పి కార్యకర్తలు పాలక్కడ్‌లో క్రిస్టమస్ తొట్టిని (క్రీస్తు జననాన్ని సూచించే చిహ్నం) ధ్వంసం చేసిన ఉదంతాన్ని ఆయన ప్రస్తావించారు. పాలక్కడ్‌లో క్రిస్టమస్ తొట్టిని ధ్వంసం చేసిన సమయంలోనే దేశ రాజధానిలో దానిని మోడీ గౌరవించారని, ఇది నాటకం కాక మరేమిటని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఫేస్‌బుక్‌లో మోడీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

'అక్కడేమో బిషప్పులను సత్కరించారు. క్రిస్టమస్ తొట్లను గౌరవించారు. ఇక్కడేమో వాటిని ధ్వంసం చేశారు' అని మెలెటియస్ ఫేస్‌బుక్ పోస్టులో మండిపడ్డారు. అనంతరం ఆయన ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ సిబిసిఐ కార్యాలయానికి మోడీ వెళ్లడం ఓ డ్రామా అని వ్యాఖ్యానించారు.

విహెచ్‌పి కార్యకర్తలు ఒక పాఠశాలలో క్రిస్టమస్ వేడుకలను అడ్డుకున్నారని, పాలక్కడ్ జిల్లాలోని మరో పాఠశాలలో క్రీస్తు జననానికి గుర్తుగా విద్యార్థులు ఏర్పాటు చేసిన తొట్టిని ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో విహెచ్‌పి పాలక్కడ్ జిల్లా కార్యదర్శి కె.అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శి వి.సుషాసనన్, పంచాయతీ అధ్యక్షుడు కె.వెలయూధన్‌లను పోలీసులు అరెస్ట్ చేసి కస్టడీకి పంపారు.

బిజెపి 'వాషింగ్ మెషిన్'లోకి ఆడారి ఆనంద్ కుమార్

- పురంధేశ్వరి సమక్షంలో రాజమహేంద్రవరంలో చేరిక
- సభా సంఘం విచారణ కంచికేనా?

ఆడారి ఆనంద్‌కు కండువాను కప్పి బిజెపిలోకి ఆహ్వానిస్తున్న ఎంపి పురంధేశ్వరి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, రాజమహేంద్రవరం ప్రతినిధి

విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆనంద్ కుమార్ బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బిజెపి కార్యాలయంలో ఎంపి దగ్గుబాటి పురంధేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం ఆయన ఆ పార్టీలో చేరారు. పురంధేశ్వరి ఆయనను బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపి సిఎం రమేష్, ఎంఎల్ఎ విష్ణుకుమార్ రాజు, ఎంఎల్‌సి మాధవ్, మాజీ ఎంఎల్‌సి సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. ఆనంద్ కుమార్ 2019లో వైసిపిలో చేరారు. ఈ నెల 20న ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆడారి ఆనంద్‌కుమార్‌తోపాటు విశాఖ డెయిరీ డైరెక్టర్లు తొమ్మిది మంది, ఆయన సోదరి, అనకాపల్లి జిల్లా యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రమణి కుమారి బిజెపిలో చేరారు. విశాఖ డెయిరీ వ్యవహార శైలికి వ్యతిరేకంగా ఉత్తరాంధ్రలోని పాడి రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. తగ్గించిన పాల సేకరణ ధర పునరుద్ధరించాలని, డెయిరీ యాజమాన్యం పాల్పడిన అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని విశాఖలోని డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో డెయిరీలో అక్రమాలు, అవినీతిపై విచారణకు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో శాసన సభా సంఘం ఏర్పాటైంది. ఈ సంఘం ఇటీవల విశాఖ వచ్చి పలు విషయాలపై ఆరా తీసింది. మూడు గంటల పాటు డెయిరీలో తనిఖీలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో వైసిపికి ఆనంద కుమార్ రాజీనామా చేశారు. అవినీతి, అక్రమాలపై క్లీన్ చిట్ లభిస్తుందన్న ధీమాతోనే బిజెపిలో ఆయన చేరినట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. దేశంలోనే గనులను మింగేసిన 'ఘనుడు'తో మొదలైన బిజెపిలో అవినీతిపరుల చేరిక కొనసాగుతోంది. సిబిఐ, ఇడి, ఎసిబి కేసులు ఉన్న నేతలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఆ పార్టీలో చేరడంతో విచారణ అటకెక్కిపోతోంది. క్లీన్ చీట్ వచ్చేస్తోంది. ఆనంద్ కుమార్ బిజెపిలో చేరడంతో సభా సంఘం విచారణ కొనసాగుతుందా? అవినీతి, అక్రమాలు బయటకు వస్తాయా? ఈ విచారణను టిడిపి కూటమిలోని బిజెపి ప్రభావితం చేయకుండా ఉంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రైతుల కష్టం డెయిరీ పాలు

విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల సేకరణ ధరను లీటరుకు నాలుగు రూపాయల వరకూ తగ్గించేసింది. పశువుల దాణా ధర బస్తాకు రూ.750 నుంచి రూ.1000కు పెంచేసింది. రైతుల నుంచి లీటరు పాలను రూ.30కు సేకరించి మార్కెట్లో రూ.60కు అమ్ముకుని రూ.వేల కోట్లు ఆర్జించింది. రైతులకు బోనస్‌లు, పాల ధర వ్యత్యాస ధర చెల్లించకుండా ఎగ్గొడుతోంది. సహకార రంగంలోని విశాఖ డెయిరీని నిబంధనలకు విరుద్ధంగా అప్పటి ఛైర్మన్ ఆడారి తులసీరావు కంపెనీల చట్టంలోకి మార్చేశారు. అప్పట్లో దీనికి టిడిపి మద్దతు ఉంది. డెయిరీని కంపెనీ చట్టంలో కొనసాగించడం వల్ల రూ.వేల కోట్ల అక్రమాలు జరుగుతున్నాయని, వీటిని బయటపెట్టాలని, ఈ డెయిరీని తిరిగి 1964 సహకార చట్టంలోకి తేవాలని, తమ నుంచి సేకరిస్తున్న పాలకు న్యాయమైన ధర ఇవ్వాలని పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ చిత్తశుద్ధిపైనే ఇది ఆధారపడి ఉంది.

కజకిస్తాన్‌లో కూలిన విమానం

మొదటిపేజి తరువాయి

భూమిపై కూలిపోవడానికి ముందుగా విమానం ఒక్కసారిగా బాగా కిందకు వంగినట్లు మొబైల్ ఫోన్ ఫుటేజీ ద్వారా తెలుస్తోంది. విమానం ప్రధాన భాగం విడిపోయి దూరంగా పడిపోయినట్లు మరో వీడియోలో తెలుస్తోంది. బతికి బయటపడిన వారు విమాన శిథిలాల్లో చిక్కుకున్న వారిని లాగడం కూడా కనిపిస్తోంది. ఫ్లైట్ రాడార్ నుండి అందిన డేటా ప్రకారం కూలిపోవడానికి కొద్ది నిముషాలు ముందు విమానం గాల్లోనే పల్టీలు కొట్టినట్లుగా భావిస్తున్నారు. జిపిఎస్ జామింగ్ కూడా ఒక కారణమై వుండవచ్చుని ఫ్లైట్ రాడార్ పేర్కొంది. సంఘటనా స్థలంలోనే దర్యాప్తు జరపడానికి అధికారుల బృందం అక్కడకు బయలుదేరి వెళ్ళింది. సంఘటన పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్ బాధితుల కుటుంబాలకు సానుభూతిని తెలియచేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, అలియెవ్‌తో మాట్లాడి విషయాలు తెలుసుకున్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

మొదటిపేజి తరువాయి

జితన్ రామ్ మాంఝీ, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) అధ్యక్షులు ఉపేంద్ర కుష్వాహా, భరత్ ధర్మ జనసేన అధ్యక్షులు తుషార్ వెల్లపల్లి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగ దినోత్సవంపై నిర్మాణాత్మక చర్చ జరిగిందన్నారు. ఎన్‌డిఎ కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం, ఎంపిల నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు టిడిపి ఎంపీ తెలిపారు.. ఒక దేశం ఒకే ఎన్నిక, వక్ఫ్ చట్ట సవరణ వంటి వివాదాస్పద అంశాలు చర్చకు రాలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన తెలిపారు. అంబేద్కర్‌కు సంబంధించి పతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు అమిత్ షా ఈ సమావేశంలో కోరినట్లు తెలిసింది. వాజ్‌పేయి జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని కూటమి నిర్ణయించింది...

వలంటీర్లకు ఉద్యోగ భద్రత

- సిపిఎం డిమాండ్
- ముఖ్యమంత్రికి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం అమలు చేయాలని సిపిఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం లేఖ రాశారు. వలంటీర్లకు వేతన బకాయిలు చెల్లించడంతోపాటు బలవంతంగా రాజీనామాలు చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల మంది వలంటీర్లు గత ఐదేళ్లుగా పని చేస్తున్నారని, వీరికి తాము అధికారంలోకి వస్తే రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామని ఎన్‌డిఎ కూటమి మానిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం తమ వేతనాలు పెరుగుతాయని వలంటీర్లు ఎదురుచూస్తున్న తరుణంలో వేతనాలు పెంచకపోగా, గతంలో ఇచ్చిన రూ.5 వేలు కూడా చెల్లించడం లేదని లేఖలో పేర్కొన్నారు. వీరికి వేతన బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని, అందరినీ విధుల్లో కొనసాగించాలని కోరుతున్నట్లు చెప్పారు. వలంటీర్లలో డిగ్రీలు, పిజిలు చేసిన వారున్నారని, నెలకు కేవలం రూ.5 వేలకు పని చేయడానికి లక్షలాది మంది సిద్ధపడ్డారంటే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఏ స్థాయిలో ఉందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం కనీస వేతనాలు కూడా చెల్లించకుండా వలంటీర్ల చేత అవార్డులు, రివార్డుల పేరుతో గొడ్డు చాకిరీ చేయించుకుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకైనా ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెరుగుతాయని వలంటీర్లు ఎదురుచూస్తున్న తరుణంలో ఉన్న ఉపాధికి కూడా నష్టం కలిగేలా ప్రభుత్వం వ్యవహరించడం సరైంది కాదని సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

దిల్ రాజుకు చెక్కును అందజేస్తున్న అల్లు అరవింద్

శ్రీతేజ్ కుటుంబానికి రూ.రెండు కోట్ల సాయం

- ప్రకటించిన అల్లు అరవింద్
- నేడు సిఎంతో భేటీ : దిల్ రాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో బాధిత కుటుంబానికి రూ.రెండు కోట్ల సాయం అందజేయనున్నట్లు సినీ నిర్మాత, అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్ తెలిపారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాత రవిశంకర్‌తో కలిసి బుధవారం ఆయన పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులు వారికి వివరించారు. బాలుడి తండ్రి భాస్కర్‌తో మాట్లాడిన అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించారు.

పుష్ప-2 నటుడు అల్లు అర్జున్ తరపున రూ.కోటి, పుష్ప-2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50 లక్షలు శ్రీతేజ్ కుటుంబానికి ఇవ్వనున్నట్లు అల్లు అరవింద్ తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజుకు అందజేసినట్టు చెప్పారు. 'శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వెంటిలేషన్ తీసేశారు. బాలుడు త్వరలోనే మనందరి మధ్య తిరుగుతాడని ఆశిస్తున్నాను. న్యాయపరమైన అంశాల కారణంగా బాధిత కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నాను' అని అల్లు అరవింద్ అన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ.. హీరోలు, దర్శకులు, నిర్మాతలు కలిసి గురువారం ఉదయం పది గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవబోతున్నామని తెలిపారు. సినిమా రంగానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలని సిఎం తనకు ఎఫ్‌డిసి ఛైర్మన్ బాధ్యత ఇచ్చారని, అదే చేస్తున్నానని మీడియా అడిగిన ప్రశ్నలకు దిల్ రాజు సమాధానమిచ్చారు.

బెనిఫిట్ షోలు నిషేధం

- లేఖలో సిఎంను కోరిన సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సినిమాలకు ప్రత్యేక ప్రదర్శన (బెనిఫిట్ షో)ల నిషేధం, టికెట్ల ధరల పెంపునకు అనుమతినివ్వకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ బుధవారం లేఖ రాశారు. పెద్ద హీరోల సినిమాల విడుదల సందర్భంగా టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పరిపాటిగా మారిందన్నారు. కనీస సామాజిక స్పృహ లేని సినిమాల కోసం ప్రభుత్వం ఇటువంటి చర్యలు తీసుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదన్నారు.

తెలంగాణలో సంధ్యా థియేటర్ వద్ద జరిగిన సంఘటనతో అక్కడి ప్రభుత్వం మేల్కొందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పష్టమైన వైఖరితో ఉండాలని, ప్రత్యేక ప్రదర్శనలు నిషేధించాలని, టికెట్ల ధరల పెంపునకు అనుమతినివ్వవద్దని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

సంతలపై దాడి

మొదటిపేజి తరువాయి

300 సంతలను గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా మార్పు చేస్తారు. ఈశాన్య రాష్ట్రాలు, ఇతర కొండ ప్రాంతాల్లో ఏడాదికి 50 చొప్పున, మిగిలిన చోట్ల కనీసం 250 చొప్పున సంతలను ఆధునిక వసతులతో కూడిన మార్కెట్‌లుగా నెలకొల్పుతారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిని అనుసరించాలని ఫ్రేమ్‌వర్క్‌లో నొక్కి చెప్పారు. కాగా ఇప్పటి వరకు ఇటువంటి సంప్రదాయక సంతలను వినియోగించుకునే వారిపై మార్కెట్ ఫీజులు, సెస్సులు, లైసెన్స్‌లు నామమాత్రం. గిరిజనులు అడవుల్లో, కొండ కోనల్లో ఉత్పత్తులను సేకరించి సంతల్లో అమ్ముకోవడం ఆనవాయితీ. ఇప్పటికే స్థానిక వ్యాపారుల, దళారుల పాత్ర సంతల్లో ఉంటుంది. ఐటిడిఎల వంటివి ఉన్నా వాటి జోక్యం, నియంత్రణ చాలా తక్కువ. మామూలు చిన్న వ్యాపారులు, దళారులే గిరిజనులను మోసం చేస్తున్న పరిస్థితి ఉండగా, ఇక పెద్ద కంపెనీలు సంతల్లోకి ప్రవేశిస్తే దోపిడీ ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వినియోగదారులపై యూజర్ ఛార్జీల మోత మోగుతుంది. ప్రభుత్వ, సహకార రంగ జోక్యం మొత్తానికే పోతుంది. స్థానిక సంస్థలకు, చిన్న వ్యాపారులకు నష్టం జరుగుతుంది.

'మిట్టల్'కు ముడి ఖనిజం

మొదటిపేజి తరువాయి

సిద్ధం చేసిన ప్రణాళికలను, ఆలోచనలను ప్రధాని మోడీకి వివరించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారం చేసేందుకు కేంద్రప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సాయం అందించాలని సిఎం కోరారు. వచ్చే నెలలో ప్రధాని చేతుల మీదుగా రాష్ట్రంలో భారీగా తలపెట్టిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపే ప్రాజెక్టులపై చర్చించారు అనంతరం కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌తో సిఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వాటిని గాడిన పెట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర నిధులు విడుదల అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సాయం చేయాలని కేంద్ర మంత్రులను సిఎం చంద్రబాబు కోరారు. అనంతరం కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. విశాఖ రైల్వే జోన్ పనుల శంకుస్థాపన, రాష్ట్రంలో చేపట్టిన, చేపట్టనున్న రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసే అంశంపై చర్చించారు. అమరావతికి కొత్త రైల్వే లైన్ మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ భేటీల్లో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, ఎంపిలు పాల్గొన్నారు.

నేడు 'ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం' పుస్తకావిష్కరణ

- హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబి

ప్రజాశక్తి - నరసాపురం

పశ్చిమగోదావరి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, మాజీ ఎం ఉద్దరాజు రామం జీవన ప్రస్థానంపై 'ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం' పేరిట ప్రచురించిన పుస్తకాన్ని గురువారం నరసాపురంలో ఆవిష్కరించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో జరిగే ఈ పుస్తకావిష్కరణ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబి హాజరవుతారని ఆయన చెప్పారు.

ముందస్తు బెయిల్ కోరుతూ వాసుదేవరెడ్డి పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

హోలోగ్రామ్స్ టెండర్ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఎపి బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిబిసిఎల్) పూర్వ ఎమ్‌డి వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చెన్నైకు చెందిన జర్నలిస్ట్ శివరామన్ ఫిర్యాదు మేరకు సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. మద్యం బాటిళ్లపై అతికించే హై సెక్యూరిటీ హోలోగ్రామ్స్ తయారీ, సరఫరా కాంట్రాక్టు టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు కుంభత్ హోలోగ్రాఫిక్స్, హోలీస్టిక్ ఇండియా లిమిటెడ్, అల్ఫా లేజర్ టెక్‌ను అనుమతించడం ద్వారా వాసుదేవరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని జర్నలిస్టు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలని, హైకోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని వాసుదేవరెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

తగ్గిన క్రెడిట్ కార్డ్ చెల్లింపులు

- ఆర్‌బిఐ వెల్లడి

ముంబయి : దేశంలో క్రెడిట్ కార్డు చెల్లింపుల్లో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.2.02 లక్షల కోట్ల రికార్డ్ చెల్లింపులు చోటు చేసుకోగా.. నవంబర్‌లో 16.1 శాతం తగ్గి రూ.1.70 లక్షల కోట్లుగా చోటు చేసుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఆఫ్‌లైన్‌లో జరిగే పాయింట్ ఆఫ్ సేల్ లావాదేవీలూ నెలవారీగా 14 శాతం తగ్గగా.. ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఏకంగా 17.5 పతనం నమోదయ్యింది. గడిచిన నెలలో యాక్సిస్ బ్యాంక్ తన క్రెడిట్ కార్డుల వ్యయంలో 24 శాతం, ఎస్‌బిఐ కార్డ్ 21 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ 16.8 శాతం చొప్పున పతనం నమోదయ్యింది. నవంబర్‌లో ఎస్‌బిఐ అత్యధికంగా 2.31 లక్షలు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 1.87 లక్షలు, ఐసిఐసిఐ బ్యాంక్ 50,767 చొప్పున కొత్త కార్డులను జారీ చేశాయి. యాక్సిస్ బ్యాంక్ మాత్రం 39,734 కార్డుదారుల్ని కోల్పోయింది. ఈ ఏడాది అక్టోబర్‌లో మొత్తం క్రెడిట్ కార్డుల జారీ 7.8 లక్షలుగా ఉండగా.. నవంబర్‌లో 73 శాతం క్షీణతతో 3.5 లక్షలకు తగ్గింది.

రికవరిలో ఆర్థిక వ్యవస్థ..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో మందగమనాన్ని చవి చూసిన భారత ఆర్థిక వ్యవస్థ ఆ తర్వాత క్రమంగా పుంజుకుంటుందని ఆర్‌బిఐ తన బులిటెన్‌లో పేర్కొంది. రికవరీకి పండుగల సీజన్, గ్రామీణ డిమాండ్ పెరుగుదల దోహదం చేస్తోందని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మైఖెల్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని బృందం 'స్టేట్ ఆఫ్ ది ఎకానమీ' పేరుతో రూపొందించిన డిసెంబర్ బులెటిన్ విశ్లేషించింది. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటంతో పాటు వృద్ధి సమతౌల్యతతో ప్రపంచ ఆర్థిక సవాళ్లను తట్టుకుంటూ పురోగమిస్తోందని పేర్కొంది. భారత జిడిపిని 6.8 శాతంగా ఆర్‌బిఐ అంచనా వేయగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4 శాతానికి పరిమితమయిన విషయం తెలిసిందే.

కాలుష్యంతో విలవిల

ఔషధ, రసాయన పరిశ్రమలతో అవస్థలు
పాటించని పర్యావరణ ప్రమాణాలు
నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు!
ఆందోళనలో మత్స్యకారులు, ప్రజలు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలోని సముద్రతీర ప్రాంత ప్రజలకు కాలుష్య పరిశ్రమల ముప్పు పెరుగుతోంది. ఔషధ, రసాయన పరిశ్రమలు విడిచిపెడుతున్న వ్యర్థాలతో సముద్రంలో చేపల పునరుత్పత్తి తగ్గడం, చనిపోవడంతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటోంది. పరిశ్రమలు వచ్చినా ఉపాధి అవకాశాలు పెరగకపోగా, కాలుష్యంతో సంప్రదాయ వేట వృత్తిని వదులుకొని వ్యవసాయ, నిర్మాణ పనులు చేసుకొని బతకాల్సి వస్తోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 73 కిలోమీటర్ల పొడవున పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని 32 మత్స్యకార గ్రామాల్లో 86 వేల మంది జీవిస్తున్నారు. వీరిలో అత్యధికులు సముద్రంలో చేపల వేటపై ఆధారబడి బతుకుతున్నారు. పాయకరావుపేట డెక్కన్ కెమికల్, నక్కపల్లి హెటిరో, అచ్యుతాపురం సెజ్, పరవాడ ఫార్మా పరిశ్రమలు విడిచిపెడుతున్న వ్యర్థాలతో సముద్రంలోని చేపల ఉత్పత్తి క్రమంగా తగ్గిపోతోంది. పరిశ్రమల పరిసర ప్రజలు వివిధ వ్యాధుల బారినపడుతున్నారు. తాగునీరు కలుషితమవుతోంది. కాలుష్య పరిశ్రమల నుంచి బయటపడే మార్గాలను పరిసర మత్స్యకారులు, రైతులు, ప్రజలు ఆలోచిస్తుంటే, కాలుష్య పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వం వేగం పెంచుతోంది. ఔషధ, రసాయన పరిశ్రమలతో కాలుష్య, ప్రమాదాల సమస్యలతో జనం భయంతో బతుకీడుస్తున్నారు. ఫార్మాలో రియాక్టర్లు పేలి పెద్ద శబ్దాలు, మంటలు, పొగలు వ్యాపించినప్పుడు పరిశ్రమలకు ఆనుకొని

రాజయ్యపేట గ్రామం

ఉన్న తాడి, తానాం ప్రజలు రాత్రిపూట పరుగులు తీసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికీ ఆ భయం ఆ గ్రామాలను వెంటాడుతోంది. ఈ బోనంగి, పరవాడ, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, భరిణికం గ్రామాల్లో వాయు, నీటి కాలుష్యంతో కిడ్నీ, కేన్సర్, ఊపిరితిత్తుల సమస్యతో పలువురు బాధపడుతున్నారు. హెటిరో, డెక్కన్ కెమికల్ పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో ఈ సమస్యలు ఉన్నాయి. వాయుకాలుష్య నియంత్రణకు సరైన పర్యావరణ ప్రమాణాలు పాటించకుండా వాతావరణం చల్లబడ్డప్పుడు, రాత్రి పూట రసాయన వాయువులను విడిచిపెడుతున్నారు. జనం తలుపులు వేసుకొని ఇళ్లలో దాక్కున్నా దుర్వాసన వారిని వదలడం లేదు. అత్యధిక మత్స్యకార జనాభా కలిగిన రాజయ్యపేట మత్స్యకారులు హెటిరో డ్రగ్స్ కంపెనీ కాలుష్యం సముద్రంలో వేటలేక వ్యవసాయ పనులకు వెళుతున్నారు. సముద్రంలో దూరం వెళ్లి వేట చేసి తెచ్చిన చేపలు వాసన రావడంతో అమ్మడం కూడా కష్టంగా ఉందని మత్స్యకారుడు కాశీరావు తెలిపాడు. ఇక్కడ వేటలేక అమలాపురం, రామేశ్వరం, వాసాలతిప్ప, అంతర్వేది వెళుతున్నట్లు కోదండ చెప్పాడు. వ్యవసాయాధారిత ఉత్పత్తుల యూనిట్లను నెలకొల్పకపోగా ఇతర ప్రాంతాల్లో నిషేధించిన ఔషధ, రసాయన పరిశ్రమలను తీరంలో ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహించడంతో తీరప్రాంత ప్రజలు ఉపాధి, అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే తీర ప్రాంతంలో భారీ ఔషధ, రసాయన పరిశ్రమలు ఉన్నాయి. 272 మధ్య తరహా రసాయన, ఔషధ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఇవి కాకుండా ప్లాస్టిక్, రబ్బరు, టెక్స్‌టైల్స్‌తోపాటు పలు ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల కాలుష్యం బాధ ప్రజలకు సరిపోదన్నట్లు కాకినాడ తీర ప్రాంత మత్స్యకారులు, ప్రజలు ప్రతిఘటించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి మండలం రాజయ్యపేట, చందనాడ, వేంపాడు, బుచ్చిరాజుపేట, డిఎల్.పురంలోని 2,200 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకెళ్తోంది. వైసిపి ప్రభుత్వం చేసిన బల్క్‌డ్రగ్ పార్కు నిర్ణయాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం వేగంగా అమలు చేయడానికి సిద్ధపడుతోంది. రసాయన, ఔషధ పరిశ్రమల రాకతో కాలుష్య సమస్య మరింత తీవ్రం కానుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సహకార రంగ అభివృద్ధికి చర్యలు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సహకార రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయంలో బుధవారం 'సహకారంతో సంవృద్ధి' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. పాడిపరిశ్రమ, మత్స్య సంపద వృద్ధికి సహకార వ్యవస్థతో బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 932 మహిళా డెయిరీ సహకార సంఘాలు నడుస్తున్నాయని, వీటి ద్వారా రోజుకు ప్రస్తుతం లక్షా అరవై వేల లీటర్ల పాలు సేకరించి డెయిరీ ఏజెన్సీలకు సరఫరా అవుతుందని మంత్రి తెలిపారు. పాల సేకరణ ద్వారా 45 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పాడి పరిశ్రమాభివృద్ధి, సహకార వ్యవస్థ ద్వారా కొత్తగా ఏర్పడిన సొసైటీలకు మద్దతుగా లాభదాయకమైన ధరను పొందడానికి పాల పరీక్షా యంత్రాలు, శీతలీకరణ సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. పశుగ్రాసం పెంపకం దారులు, పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు రాష్ట్రంలో పౌడర్ ప్లస్ ఎఫ్‌పిఒలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సహకార సంఘాలకు నగదు ఉపసంహరణ పరిమితిని ఏడాదికి కోటి నుంచి రూ.3 కోట్లకు పెంచామన్నారు. దేశ వ్యాప్తంగా పాలసేకరణలో 4వ స్థానంలో రాష్ట్రం ఉందని, మరింత అభివృద్ధి చేసి మొదటి స్థానానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. మత్స్య పరిశ్రమలో 2,400 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయని, అవన్నీ 3 లక్షల మందికి చేదోడుగా నిలిచాయని, సంఘ సభ్యులకు బోట్లు, వలలు, చేప పిల్లలు పంపిణీ చేస్తూ వారి ఆర్థిక వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి సహకార సంఘాలకు మేలు చేకూర్చే చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. సహకార సంఘాలకు ఆదాయ పన్నును 30 శాతం నుంచి 15 శాతానికి కుదించడం ద్వారా అధిక లాభాల బాటలో పయనించేందుకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి ఎమ్ఎమ్ నాయక్, డైరెక్టర్ దామోదర నాయుడు, మత్స్యశాఖ కమిషనరు డోలా శంకర్, ఆప్కాబ్ సిజిఎం వెంకటరత్నం పాల్గొన్నారు.

ఐటిడిఎ వద్ద ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఒంటి కాలిపై ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

గురుకుల పాఠశాలలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఒంటికాలుపై నిల్చుని నిరసన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలోని ఐటిడిఎ కార్యాలయ ప్రధాన గేటు పక్కనున్న అడవి తల్లి విగ్రహం వద్ద దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలు బుధవారం నాటికి 36వ రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. డిఎస్‌సి నుంచి తమ పోస్టులను మినహాయించి, ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస స్థాయిలో లేని జీతాలతో మరో ఉద్యోగం వైపు చూడకుండా పని చేస్తున్న తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సమ్మెబాట పట్టి 36 రోజులు దాటుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గిరిజన విద్య, మిథ్యగా మారుతోందని తెలిపారు. కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘ నాయకులు మోహనరావు, ధర్మారావు, గణేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిపిఎం 'అనంత' జిల్లా కార్యదర్శిగా నల్లప్ప

- తొమ్మిది మందితో కార్యదర్శి వర్గం
- 26 మందితో జిల్లా కమిటీ : రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శిగా ఓ.నల్లప్ప ఎన్నికయ్యారు. తొమ్మిది మందితో కార్యదర్శివర్గం, 26 మందితో జిల్లా కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం ఆయన గణేనాయక్ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా 14 మహాసభ, నూతన కార్యవర్గం ఎన్నిక వివరాలు వెల్లడించారు. రెండు రోజులపాటు జరిగిన 14వ జిల్లా మహాసభ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిందన్నారు. జిల్లా సమస్యలతోపాటు మూడేళ్ల కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలను మహాసభలో సమీక్షించినట్లు తెలిపారు. రాబోయే మూడేళ్ల భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు వివరించారు. జిల్లాలో సాగు, వ్యవసాయం ప్రధానమైనవని, ఈ రెండు రంగాలను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యలపై రాబోయే రోజుల్లో విస్తృత పోరాటాలు నిర్వహించాలని మహాసభలో నిర్ణయించినట్లు చెప్పారు. మహాసభ నిర్ణయాల అమలుకు రాబోయే మూడేళ్లలో నూతన కమిటీ కృషి చేస్తుందన్నారు.

జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా వి.రాంభూపాల్, సావిత్రి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, బి.శ్రీనివాసులు, ఆర్.రామిరెడ్డి, కృష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖరరెడ్డి ఎన్నికయ్యారు. 17 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

సమన్వయంతో ముందుకెళతాం : నల్లప్ప

అందరినీ సమన్వయం చేసుకుని ఐక్యపోరాట ఉద్యమాలను చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప తెలిపారు. కార్యదర్శిగా ఎన్నికైన తరువాత మీడియాతో ఆయన మాట్లాడారు. అందరి సహకారంతో రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతపురం జిల్లాలో ముందు తరం కమ్యూనిస్టులు నెలకొల్పిన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని అన్నారు.


కరపత్రాలు పంపిణీచేస్తున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు తదితరులు

కుసులవాడలో మైనింగ్ అనుమతులు రద్దుచేయాలి

- 28న ప్రజాభిప్రాయ సేకరణను తిప్పికొట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆనందపురం (విశాఖపట్నం)

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం కుసులవాడలో మైనింగ్ తవ్వకాలకు మళ్లీ ప్రయత్నిస్తున్నారని, వాటిని ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం కోరింది. కుసులవాడ గ్రామంలో బుధవారం సిపిఎం నాయకులు పర్యటించారు. 78వ కార్పొరేటర్ గంగారావు, సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యాన కుసులవాడ పంచాయతీ చిన్నాపురం, ఇచ్ఛాపురం, కుసులవాడ గొల్లపాలెం గ్రామాలలో పర్యటించి మైనింగ్ అనుమతులు రద్దుచేయాలని నిరసిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, కుసులవాడ గ్రామపంచాయతీ సర్వే నెంబరు 104 తెల్ల కొండ (ఎద్దుమెట్ట)పై గత ఆగస్టు నెల 28న చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టడంతో అధికారులు వెనుదిరిగారని తెలిపారు. ఇటీవల మరలా విఆర్ ఇన్ఫ్రా టెక్నాలజీ సంస్థ ప్రకటనలిచ్చి 28న ప్రజాభిప్రాయ సేకరణ జరపడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కుసులవాడలో మైనింగ్ తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంత ప్రజల జీడి, మామిడి, కొబ్బరి తోటలతో పాటు ఇతర పంటలకు అపార నష్టం జరుగుతుందన్నారు. గాలి, తాగు నీరు కలుషితం అవుతాయని, కాలుష్య ప్రమాదం పెరుగుతుందని తెలిపారు. బ్లాస్టింగ్ రహిత అనుమతులంటూ మాయ మాటలు చెప్పి మైనింగ్ తవ్వకాలకు ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో టైంస్లాట్ కౌంటర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - తిరుమల, తిరుపతి బ్యూరో

తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనాల ఎస్ఎస్‌డి టైం స్లాట్ టోకెన్లు జారీ కౌంటర్లను టిటిడి ఇఒ శ్యామలరావు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్‌పి సుబ్బరాయుడు గురువారం పరిశీలించారు. జనవరి 10 నుంచి 19 తేదీలలో వైకుంఠ ద్వార దర్శనాలను టిటిడి కల్పించనుంది. 10 నుంచి 12 తేదీల్లో 1.20 లక్షల టోకెన్లు జనవరి ఎనిమిదిన ఉదయం ఆరు గంటల నుంచి జారీ చేస్తారు. మిగిలిన ఏడు రోజులకు ముందు రోజు జారీ చేయనున్నారు. టోకెన్ల జారీకి తిరుపతి, తిరుమలలో తొమ్మిది కేంద్రాల్లో 91 కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. గోవిందమాల యాత్రికులకు ఎటువంటి ప్రత్యేక టికెట్లనూ జారీ చేయడం లేదని ఇఒ శ్యామలరావు తెలిపారు.

టిటిడికి రూ.1.11 కోట్లు విరాళం

టిటిడి ఎస్‌వి అన్న ప్రసాదం ట్రస్టుకు భారీ విరాళం అందింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ సిఇఒ పి.ఎం.ఎస్.ప్రసాద్ గురువారం రూ.1.11 కోట్ల విరాళం డిడిని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరికి అందజేశారు.


నిరసన తెలుపుతున్న దళిత, ఆదివాసీ, ప్రజాసంఘాల నాయకులు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పార్లమెంట్ వేదికగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని దళిత, ఆదివాసీ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ ఫొటోలు చేతబట్టి నిరసన తెలిపారు. మనుస్మృతి గ్రంథం తగులబెట్టేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో 'సనాతన ధర్మం - భారత రాజ్యాంగం' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మనుస్మృతి పాలనను కొనసాగిస్తూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని విస్మరిస్తోందని ధ్వజమెత్తారు. దేశం గర్వించదగ్గ మహానేత అంబేద్కర్ అని, ఆయనపై అనుచిత వ్యాఖ్యలను చేసిన అమిత్ షాపై కేంద్ర ప్రభుత్వం నేటికీ చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రజలు గమనించాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రతో బిజెపి ప్రభుత్వం ముందుకుపోతోందని, దీన్ని దళిత, ఆదివాసీ, ప్రజాసంఘాలు, ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కళ్లేపల్లి రాంగోపాల్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, మానవ హక్కులు వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెవి జగన్నాథం, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, ఎస్ఎన్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి గణేష్, సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల రామారావు, జనవిజ్ఞాన వేదిక, పౌర హక్కుల వేదిక, డిటిఎఫ్, కెఎన్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

తల్లి విజయమ్మతో కలిసి కేక్ కట్ చేస్తున్న జగన్

క్రిస్మస్ వేడుకల్లో జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప జిల్లాలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. పులివెందులలోని సిఎస్ఐ చర్చిలో జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థన కూటమిలో ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కేకును తల్లికి తినిపించారు. సిఎస్ఐ చర్చి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను జగన్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనా కూటముల అనంతరం చర్చిలో జగన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్య పథం వైపు నడవాలన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, రాయచోటి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, ప్రజాప్రతినిధులు, చర్చి పాస్టర్స్, వైఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రార్థనా కూటముల అనంతరం లింగాల మండలంలోని తాతిరెడ్డిపల్లిలో రామాలయాన్ని జగన్ ప్రారంభించారు.

నాలుగు వేలకు చేరిన ఓలా ఎలక్ట్రిక్ స్టోర్లు

బెంగళూరు : ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన రిటైల్ స్టోర్లను 4,000కు విస్తరించినట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా కొత్తగా 3,200 స్టోర్లను తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు బుధవారం వెల్లడించింది. దీంతో ప్రస్తుతం ఉన్న 800 స్టోర్ల సంఖ్య 4 వేలకు పెరిగిందని ఓలా ఎలక్ట్రిక్ సిఇఒ భవీష్ అగర్వాల్ పేర్కొన్నారు.

రూపాయి పతనం.. అధిక ధరలకు ఆజ్యం

- ఎలక్ట్రానిక్, వాహన ఉత్పత్తులు మరింత ప్రియం
- విదేశీ విద్య, ప్రయాణం కష్టమే
- చమురు మంటే..
- ఐదేళ్లలో రూపీ 20 శాతం పతనం

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

విశ్వగురుగా చెప్పుకొంటున్న ప్రధాని నరేంద్ర మోడీ హయంలో ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ రికార్డ్ పతనాన్ని చవి చూస్తోంది. చరిత్రలో ఇది వరకూ ఎప్పుడూ లేని విధంగా రూపీ క్షీణించడంతో పేద, సామాన్య, ధనిక భారతీయులందరిపై ప్రత్యక్షంగా.. పరోక్షంగా తీవ్ర ప్రభావం చూపనుంది. మంగళవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు క్షీణించి 85.20 కనిష్ట స్థాయికి దిగజారింది. వరుస పతనంతో రూపాయి చరిత్రలోనే అత్యంత పేలవ ప్రదర్శనను కనబర్చుతోంది. గడిచిన ఐదేళ్లలో ఈ కరెన్సీ 20 శాతం పైగా పడిపోయింది. భవిష్యత్తు రోజుల్లో ఇది మరింత క్షీణించొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత ఆర్థిక విధానాలతో దేశంలో ఇప్పటికే అధిక ధరలు బెంబేలెత్తిస్తున్న తరుణంలో కరెన్సీ క్షీణత ద్రవ్యోల్బణానికి మరింత ఆజ్యం పోయనుందని హెచ్చరిస్తున్నారు. హెచ్చు ధరలతో ప్రజల ఆదాయం పడిపోనుంది. వస్తువులకు డిమాండ్ తగ్గి, అంతిమంగా ఇది తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారి తీయనుంది. డిసెంబర్ నెల ముగుస్తుండటంతో దేశీయ మార్కెట్‌లోని దిగుమతిదారులపై చెల్లింపుల ఒత్తిడి ఉంటుందని దీంతో డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి విలువను మరింత బలహీనపరుస్తుందని ఫారెక్స్ ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ జనవరిలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో మళ్లీ సుంకాల యుద్ధం మొదలవుతుందన్న అంచనాలు గట్టిగానే వినపడుతున్నాయి. ఫలితంగా ముందు జాగ్రత్తగా డాలర్ల కొనుగోళ్ల కోసం భారతీయ దిగుమతిదారులు ఎగబడుతున్నారు. దేశీయ మార్కెట్ల నుంచి ఆగని విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణలు రూపాయి పరిస్థితుల్ని మరింత దిగజార్చుతున్నాయి. ట్రంప్ గెలుపొందినప్పటి నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడంతో గడిచిన మూడు నెలల్లోనే ఆర్‌బిఐ వద్ద విదేశీ

మారకం నిల్వలు 50 బిలియన్ డాలర్లు తరిగిపోయాయి. దేశీయ కరెన్సీ వరుస పతనం వల్ల ముఖ్యంగా దిగుమతి ఉత్పత్తులు భారంగా మారనున్నాయి. విదేశీ విద్య, అంతర్జాతీయ ప్రయాణాలు. వాహనాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, చమురు, బంగారం, వంటనూనెలు, పప్పు దినుసులు తదితరాల ధరలు మరింత పెరుగుతాయి. విదేశాల్లో చదువుకునే భారతీయ విద్యార్థులు విద్య, వీసాలు, వసతి కోసం భారీగా చెల్లించాల్సి వస్తుంది. అదానీ కోసం కేంద్రం భారీగా బొగ్గు దిగుమతులకు అనుమతిస్తోన్న విషయం తెలిసిందే. ఈ రంగానికి అధికంగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఆ బొగ్గుతో ఉత్పత్తి చేసిన విద్యుత్ భారం కానుంది. దేశం మొత్తం చమురు వినియోగంలో 85 శాతం దిగుమతుల నుంచి సమకూర్చుకుంటున్నదే.. చమురు దిగుమతులపై భారీగా చెల్లింపులు జరుగుతున్నాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరగనున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ బలహీనంగా ఉండటంతో ఇప్పటికే వాణిజ్య లోటు అమాంతం పెరుగుతోంది. ఈ పరిణామాలు భారత్‌లో అధిక ధరలకు ఆజ్యం పోయనున్నాయి. ఈ క్రమంలో ద్రవ్యోల్బణం మరింత ఎగిసిపడనుంది.

వడ్డీ రేట్లు పెరగొచ్చు..

హెచ్చు ద్రవ్యోల్బణ కట్టడికి ఆర్‌బిఐ వడ్డీ రేట్లను పెంచాల్సి రావొచ్చు. ఇప్పటికే హెచ్చు వడ్డీ రేట్లతో అన్ని రకాల రుణాలు ప్రియమయ్యాయి. రూపాయి దెబ్బతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నం దున రాబోయే ఆర్‌బిఐ ఎంపిసి సమీక్షల్లో వడ్డీ రేట్లు పెంచడానికి మెండుగా అవకాశాలున్నాయి. అదే జరిగితే అన్ని రకాల రుణాలు మరింత భారం కానున్నాయి. ప్రస్తుత వాయిదా చెల్లింపుల (ఇఎంఐ) విలువ పెరగనుంది. దీంతో గృహ, వాహన అమ్మకాలపై ఒత్తిడి పెరగనుంది. అధిక ధరలు, హెచ్చు వడ్డీ రేట్లు ప్రజల కొనుగోలు శక్తిని హరించనున్నాయి. దీంతో వస్తు డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం పడనుంది.

ఐదేళ్లలో 100కు పడొచ్చు..

ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ మరింత పడిపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో 20 శాతం క్షీణించగా.. వచ్చే ఐదేళ్లలోనూ ఇదే స్థాయిలో పతనం కావొచ్చని పలు రిపోర్టులు చెబుతున్నాయి. 2030 నాటికి అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 100కు పడిపోవచ్చని దిక్వింట్ ఓ కథనంలో వెల్లడించింది. 2019లో డాలర్‌తో రూపాయి విలువ 70గా ఉంది. గడిచిన ఐదేళ్లలో మోడీ 2.0 హయంలో 20 శాతం పతనమై 85కు దిగజారింది. మోడీ 3.0 నేతృత్వంలోని 2029 డిసెంబర్ నాటికి 100కు దిగువకు పతనం కావొచ్చని అంచనా. 2025 డిసెంబర్ నాటికి 87-88 మధ్య ఉండొచ్చని.. 2027 నాటికి రూ.95కు క్షీణించొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2029 నాటికి మూడో సారి మోడీ ప్రభుత్వ పదవీ కాలం పూర్తి కానుంది.

విదేశీ అప్పు చెల్లింపులు భారమే..

భారత్‌లోకి వచ్చి.. పోయే విదేశీ కరెన్సీ ఆధారంగా లెక్కించే కరెంట్ ఖాతా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ లోటును ఎదుర్కోవచ్చని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ అంచనా వేసింది. డాలర్ విలువ పెరగడం.. రూపాయి అమాంతం బక్కచిక్కడంతో ప్రపంచ దేశాల నుంచి భారత్ తీసుకున్న అప్పులపై అధిక వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. దిగుమతులు, అప్పులు, వడ్డీలకు చేసే విదేశీ చెల్లింపులతో భారత మారకం నిల్వలు వేగంగా కరిగిపోనున్నాయి. ఈ పరిణామాలకు తోడు హెచ్చు ద్రవ్యోల్బణం రూపాయిని, దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువను మరింత పటిష్టం చేస్తామని.. ఎట్టిపరిస్థితుల్లోనూ పడనివ్వబోమని 2013 ఎన్నికల ప్రచార సమయంలో నరేంద్ర మోడీ చేసిన ప్రచార అర్భాటానికి.. వాస్తవ పరిస్థితులు అత్యంత భిన్నంగా ఉన్నాయి. మోడీ అధికారంలోకి రాకముందు డాలర్‌తో రూపాయి విలువ 60 దిగువన ఉంది. రానున్న రోజుల్లోనూ రూపాయి విలువ పతనాన్ని మోడీ ఆపలేరోమోనని ఇటీవలి పలు పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

సంపాదకీయం

బోనులో నిలబెట్టాలి

సామాన్యులు, మధ్యతరగతి డిపాజిటర్లు పొదుపు చేసిన సొమ్ము ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పాలవుతోంది. బ్యాంకులకు రుణబకాయిలు చెల్లించే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా ఎగవేసే క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లు మోడీ ఏలుబడిలో రోజురోజుకూ పెరిగిపోతున్నారు. ఆర్‌బిఐ అందించిన లెక్కల ప్రకారమే 2020లో 2,154 గా ఉన్న ఉద్దేశపూర్వక ఎగవేతదారులు 2024కి వచ్చేసరికి 2,664కు పెరిగిపోయారు. బ్యాంకులకు వీరు ఎగ్గొట్టిన మొత్తం ఈ కాలంలో లక్షా 52 వేల 860 కోట్ల రూపాయల నుంచి లక్షా 96 వేల కోట్ల 441 కోట్ల రూపాయలకు చేరింది. ఇదంతా సామాన్యులు బ్యాంకుల్లో చేసుకున్న డిపాజిట్ల సొమ్మే. ఇప్పటికీ బ్యాంకు మొత్తం డిపాజిట్లలో 75 శాతం దాకా సామాన్యుల నుంచి సేకరించినవేనని ఆర్‌బిఐ నివేదికలే చెబుతున్నాయి. సామాన్యులు దాచుకున్న సొమ్మును లూటీ చేస్తున్న ఆర్థిక నేరగాళ్లలో చాలా వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సన్నిహితులైన వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలే. ఈ రుణ ఎగవేతదారుల్లో చాలా మంది నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడినవారున్నారు. ఇటువంటి వారిని శిక్షించాల్సిన ప్రభుత్వం, ఆర్‌బిఐలే వారికి రక్షణగా ఉంటున్నాయి. 2023 జూన్ 3న ఆర్‌బిఐ జారీ చేసిన సర్క్యులర్ పేరా 6(2)లో ఉద్దేశపూర్వక ఎగవేతదారులు, ఆర్థిక మోసాలకు పాల్పడినవారితో రాజీ ఒప్పందాలు కుదుర్చుకోవాలని బ్యాంకులకు సూచించింది. 2016లో తీసుకొచ్చిన దివాలా కోడ్ బ్యాడ్ లోన్స్‌ను థర్డ్ పార్టీకి విక్రయించాలని బ్యాంకులను ఆదేశిస్తోంది.

బ్యాంకులకు లక్షల కోట్ల రూపాయలు ఎగవేసే కార్పొరేట్ల నుంచి వాటిని రికవరీ చేయడానికి బదులు, ఈ కంపెనీలకు ప్రతి యేటా లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తోంది. అదే సమయంలో దేశానికి అన్నం పెట్టే రైతులు సంక్షోభంలో ఉన్నారు, వారి రుణాలను మాఫీ చేయమంటే కుదరదు పొమ్మంటోంది. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్లకు ప్రజల సొమ్ము దోచిపెట్టడం వల్ల బ్యాంకులకు కలిగే నష్టాలను భర్తీ చేసేందుకు డిపాజిట్లపై వడ్డీ రేట్ల తగ్గింపు, మినిమమ్ బ్యాలెన్స్ లేకుంటే పెనాల్టీలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే రుణాలపై అధిక వడ్డీ వసూలు వంటి పద్ధతులు అవలంభిస్తున్నాయి. బ్యాంకులను ముంచేస్తున్న వారిపై మాత్రం ఎలాంటి క్రిమినల్ ప్రొసీజర్స్ ఉండవు.

సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా దాఖలు చేసిన అర్జీకి ప్రతిస్పందనగా టాప్ 100 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల వివరాలను ఆర్‌బిఐ వెల్లడించి చేతులు దులిపేసుకుంది. 2018లో దేశం విడిచి పారిపోయిన నీరవ్‌మోడీకి చెందిన గీతాంజలి జెమ్స్ బ్యాంకులకు రూ.8,516 కోట్లు బకాయి పడింది. ఇదే అత్యధిక మొత్తం ఎగవేతదారుగా ఉంది. ఇప్పుడే కాదు, ఇంతకుముందు కూడా అది భారీగా రుణాన్ని ఎగవేసింది. ఎన్ని సార్లు ఎగవేసినా ఏమీ కాదు అన్న వాతావరణాన్ని ప్రభుత్వమే కల్పించాక ఎగవేతదారులు పెరగకుండా ఎలా ఉంటారు. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాఫీ చేసిన రుణాలు అక్షరాలా 16.11 లక్షల కోట్ల రూపాయలు. అంతకుముందు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం పదేళ్లలో మాఫీ చేసినదాంతో పోల్చితే ఇది ఎనిమిది రెట్లు ఎక్కువ. వామపక్షాల ఒత్తిడి ఫలితంగా యుపిఎ-1 ప్రభుత్వం అప్పట్లో రూ. 60 వేల కోట్ల మేర వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తే ఇది దండగమారిన చర్యగా గగ్గోలు పెట్టిన 'ప్రధాన స్రవంతి మీడియా' ఈ రుణ ఎగవేతలపై ఒక్క ముక్క కూడా ప్రస్తావించడం లేదు. అమెరికా లాంటి దేశాల్లో పారుబకాయిలు ఒక శాతం కంటే తక్కువగా ఉంటే... భారత్‌లో ఇది 7.85 శాతంగా ఉన్నాయి. ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు ఇచ్చే మొత్తం రుణాల్లో వ్యవసాయ రంగానికి 40 శాతం ఇవ్వాలి. కానీ, 12 శాతానికి మించి ఇవ్వడం లేదు. క్రోనీ కేపిటలిస్టులు, కార్పొరేట్ల పట్ల వున్న ప్రేమ వ్యవసాయంపై మోడీ ప్రభుత్వానికి లేదనడానికి ఇదొక నిదర్శనం. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఒక వైపు ప్రైవేటీకరిస్తూ, ఇంకో వైపు ఉన్న బ్యాంకులను కూడా దివాలా తీయించే చర్యలు ప్రభుత్వం చేపడుతోంది. దీనికి వ్యతిరేకంగా బ్యాంకు సిబ్బంది పలుమార్లు సమ్మె చేసినా ప్రభుత్వం లెక్కచేయడం లేదు. ఈ స్థితిలో బ్యాంకులకు పెద్ద యెత్తున రుణాలను ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన వారి నుంచి తిరిగి రాబట్టేలా చూసేందుకు బ్యాంకు ఉద్యోగులతోబాటు ప్రజలు పెద్దయెత్తున ఉద్యమించాలి. ఆర్థిక నేరగాళ్లను బోనులో నిలబెట్టాలి.

మహనీయుల మాట

నేడు మావో 131వ జయంతి

మనలో లోపాలుంటే వాటిని ఎవరైనా చూసినా, విమర్శించినా అందుకు మనం భయపడకూడదు. ఎవరైనా సరే, మన తప్పును ఎత్తి చూపవచ్చు. వారు చెప్పేది సరైనదైతే, వాటిని దిద్దుకుంటాం. వారు చెప్పేది ప్రజలకు ఉపయోగపడితే, తప్పకుండా వాటిని అమలు జరుపుతాం.

- మావో సేటుంగ్,
చైనా రిపబ్లిక్ అధ్యక్షుడు.

జననం: 26.12.1893
మరణం : 9.9.1976

చట్టం అందరికీ సమానమేనా?

విశ్లేషణ

భారత రాజ్యాంగం 3వ భాగంలోని ఆర్టికల్ 14 'చట్టం ముందు అందరూ సమానులే', 14 బి 'చట్టం అందరినీ సమానంగా రక్షిస్తుంది' అని స్పష్టంగా చెబుతుంది. ఆర్టికల్ 12 నుండి 35 వరకు పౌర హక్కుల గురించి చెబుతాయి. రాజ్యాంగంలో ఎన్ని మంచి అంశాలున్నా అవి యథాతథంగా అమలవుతాయన్న గ్యారంటీ లేదు. కారణం దాన్ని అమలు చేయాల్సింది అధికారంలో వున్న పార్టీల నేతలు. వారి ప్రయోజనాలను బట్టి అవి అమలవుతాయి. అందుకే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ "మన రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు చేసే పాలకులు మంచివారు కాకపోతే అది చెడ్డదవుతుంది. పాలకులు మంచి వారైతే రాజ్యాంగంలోని ఇబ్బందికర అంశాలు కూడా మంచిగా అమలయ్యే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలు ఎలాంటి పాలకులను ఎన్నుకుంటారనే విజ్ఞతను బట్టి మన రాజ్యాంగం మంచి చెడ్డలు ఆధారపడి వుంటాయ"ని చెప్పారు. ఆయన చెప్పింది ఎంత అక్షర సత్యమో మనకు అనుభవం రుజువు చేస్తున్నది. హక్కుల కోసం, హామీల అమలు కోసం కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు చేసే ఆందోళనలను అణచివేసే పాలకులు మరోవైపు మాత్రం...కోట్ల విలువైన సహజ సంపదను, ప్రభుత్వ ఆస్తులను కాజేస్తున్న, బ్యాంకులను లూటీ చేస్తున్న వారిని రక్షిస్తున్నారు. జైల్లో నిర్బంధించబడిన సంఘ సేవకుడు స్టాన్‌స్వామి చేతులు వణుకు తున్నాయి, నీటిని తాగలేకపోతున్నాను. స్ట్రా ఇవ్వమని కోరుకుంటే కనికరించని కోర్టు...ఒక రాజకీయ నాయకుడికి జైల్లో దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలని చెప్పింది. అక్రమాలకు, అనైతిక చర్యలకు పాల్పడిన డేరా బాబాకు అర్జెంట్‌గా బెయిల్ ఇచ్చిన న్యాయస్థానం, తొంభై శాతం అంగవైకల్యంతో వున్న ప్రొఫెసర్ సాయిబాబాను పది సంవత్సరాలు నిర్బంధించింది. సుప్రీంకోర్టులో 82,640 కేసులు పెండింగ్‌లో ఉండగా అధికార పార్టీకి నిత్యం వంత పాడే జాతీయ టీవీ జర్నలిస్టు అర్ణబ్ గోస్వామికి బెయిల్ ఇవ్వడానికి, ప్రొఫెసర్ సాయిబాబా బెయిల్‌ను రద్దు చేయడానికి సెలవు రోజు పని చేసిందంటే చట్టం అందరికీ సమానమేనా అనే సందేహం కలుగక మానదు! కేంద్ర, రాష్ట్ర పాలకులు రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, అదే రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామని చెబుతూనే ఈ రకంగా వ్యవహరిస్తున్నందున చట్టం అందరికీ సమానమేనా! అనే సందేహం ఆలోచించే ప్రతిఒక్కరికీ పదేపదే వచ్చితీరుతుంది.

వి. రాంభూపాల్

"పిచ్చిలో కూడా ఒక పద్ధతి ఉంటుంది. అణచివేత చట్టాలన్నీ న్యాయ వ్యవస్థపై అపనమ్మకాన్ని సూచిస్తున్నాయి. అనుమానం ఉన్న వారందరినీ శిక్షించాలనే ఆత్రుత పాలకుల్లో ఉంటుంది. ఇన్నేళ్ళ మీ పాలన తర్వాత కూడా ఈ చట్టాలు అవసరమని మీరు భావిస్తే మీ పాలన ఎంత దౌర్భాగ్యంగా ఉందో తెలిసిపోతుంది" 1936లో మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు సత్యమూర్తి అన్న మాటలు ఇవి. విదేశీ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ఆనాడు మాట్లాడిన మాటలు ఈ నాటికీ వర్తిస్తున్నాయంటే పాలకులు మారారుకానీ వారి అణచివేత విధానాలు మారలేదన్నది స్పష్టం. పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించిన రాజ్యాంగం, పరాయి పాలన నాటి రాజద్రోహ చట్టాన్ని కూడా అమలు చేసే అవకాశం కల్పించింది.

బ్రిటీష్ పాలన నాటి రాజద్రోహ చట్టం 124 ఎ కింద ఈ పది సంవత్సరాల్లో వందల మందిపై కేసులు పెట్టగా, కేవలం ఆరుగురి మీద మాత్రమే నేరాలు రుజువయ్యాయి. 2016-19 మధ్య ఈ చట్టం కింద నమోదైన కేసుల సంఖ్య 160 శాతం పెరగగా, నేరాల నిరూపణ 3 శాతానికి పడిపోయింది. చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద 2015-2022 మధ్య 10,552 మందిని అరెస్టు చేశారు. ఇందులో నేరం రుజువైంది కేవలం 253 మంది మీద మాత్రమేనని కేంద్ర నేర పరిశోధన బ్యూరో ప్రకటించింది. అంటే ఈ చట్టం కింద అరెస్టయిన వారిలో కేవలం 2.2 శాతం మంది దోషులు కాగా, 97.8 మంది నిర్దోషులన్నమాట. దేశ పాలకులు స్వదేశీ పేరుతో విదేశీ పాలనా కాలం నాటి చట్టాలతో ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేస్తున్నారు.



1860లో థామస్ బాబింగ్టన్ మెకాలే రూపొందించిన ఈ ఐపిసి కి 1871లో చేసిన సవరణ ప్రకారం "చట్టం ద్వారా స్థాపించబడిన ప్రభుత్వం పట్ల అసంతృప్తి కూడా రాజద్రోహమే". ఈ సెక్షన్ కింద 1891లో బెంగాల్‌కు చెందిన పత్రికా సంపాదకుడు జోగేంద్ర చందర్ బోస్‌పై మొదటి రాజద్రోహ కేసు నమోదైంది. ఆ తర్వాత 1897, 1908లో బాలగంగాధర తిలక్, 1922లో మహాత్మా గాంధీ లాంటి జాతీయోద్యమ నాయకులను ఈ చట్టం పేరుతో సంవత్సరాలుగా నిర్బంధించారు. "కోట్ల మంది భారతీయుల హక్కుల కోసం రాజును ధిక్కరించడమే నేరమైతే, ఆ నేరాన్ని పదేపదే చేస్తాను" అని తిలక్ ప్రకటించాడు. ఈ చట్టానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమంలో అనేక ఉద్యమాలు జరిగాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా ఈ రాజద్రోహ చట్టం ఇంకా అమలు అవుతూనే వుండడం పాలకుల స్వభావానికి నిదర్శనం.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, కాశ్మీర్‌లలో జరుగుతున్న రైతాంగ పోరాటాలను కాంగ్రెసు నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం క్రూరంగా అణచివేసింది. కేరళలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చివేయడం, రైల్వే కార్మికుల, ఉద్యోగుల హక్కులను కాలరాయడం, చివరకు ఎమర్జెన్సీ విధించి దేశ పౌరుల హక్కులన్నింటినీ రాజ్యాంగం పేరుతోనే అణచివేయడం చూశాం. మన దేశ పాలకులు గ్రామీణ భూస్వాములు, పట్టణ పారిశ్రామికాధిపతుల పక్షాన నిలవాలని నిర్ణయించుకున్నందునే... తమ హక్కులను అణచివేసిన ప్రతి సందర్భంలోనూ దేశ ప్రజలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు వాటిని కాపాడుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు పాలకులను ప్రతిఘటించారు. తగిన గుణపాఠం నేర్పారు.

మోడీ పాలనలో...

కాంగ్రెస్ ప్రభుత్వం భూస్వామ్య, పారిశ్రామిక సంపన్నుల కోసం ప్రజల హక్కులను కాలరాస్తే, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఆ సంపన్నులతో పాటు, మత రాజ్య నిర్మాణం కోసం ఉద్యమకారులను, మేధావులను, విలేకరులను రాజద్రోహ చట్టం, ఉపా చట్టం, జాతీయ భద్రత చట్టం పేరుతో తీవ్ర అణచివేతకు పాల్పడుతుంది. బ్రిటీష్ పాలన నాటి రాజద్రోహ చట్టం 124 ఎ కింద ఈ పది సంవత్సరాల్లో వందల మందిపై కేసులు పెట్టగా, కేవలం ఆరుగురి మీద మాత్రమే నేరాలు రుజువయ్యాయి. 2016-19 మధ్య ఈ చట్టం కింద నమోదైన కేసుల సంఖ్య 160 శాతం పెరగగా, నేరాల నిరూపణ 3 శాతానికి పడిపోయింది. చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద 2015-2022 మధ్య 10,552 మందిని అరెస్టు చేశారు. ఇందులో నేరం రుజువైంది కేవలం 253 మంది మీద మాత్రమేనని కేంద్ర నేర పరిశోధన బ్యూరో ప్రకటించింది. అంటే ఈ చట్టం కింద అరెస్టయిన వారిలో కేవలం 2.2 శాతం మంది దోషులు కాగా, 97.8 మంది నిర్దోషులన్నమాట. దేశ పాలకులు స్వదేశీ పేరుతో విదేశీ పాలనా కాలం నాటి చట్టాలతో ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయిన మొదటి సంవత్సరంలో 160 మంది ముస్లిం యువకులను జాతీయ భద్రత చట్టం (ఎన్‌ఎస్‌ఎ) కింద అరెస్టు చేశారు. కాశ్మీర్‌కు చెందిన ఐజాజ్ బాబాపై గుజరాత్ పోలీసులు కేసు నమోదు చేసి 11 ఏళ్ళు జైల్లో పెట్టి చివరకు నిర్దోషి అని విడుదల చేశారు. ఉత్తరప్రదేశ్ లోని హత్రాస్‌లో దళిత యువతిపై అత్యాచారం, హత్యకు పాల్పడి, చివరకు మృతదేహాన్ని తల్లితండ్రులకు అప్పగించకుండానే కాల్చివేసిన దుర్మార్గంపై వార్తాకథనం రాసిన జర్నలిస్టు సిద్ధక్ కప్పన్‌ను 711 రోజులు జైల్లో నిర్బంధించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ వార్తలు కవరేజీ చేసినందుకు 'న్యూస్ క్లిక్' నిర్వాహకుడు, ప్రముఖ ఇంజనీర్ ప్రబీర్ పుర్కాయస్తను రెండు సంవత్సరాల పాటు జైల్లో వుంచారు. ఇలా ఒకరిద్దరు కాదు, వందల మంది మేధావులు, రచయితలు, హక్కుల కార్యకర్తలు తప్పుడు కేసులను ఎదుర్కొంటున్నారు.

ఇలా ఎందుకు జరుగుతున్నది?

మోడీ పది సంవత్సరాల పాలనా కాలంలో ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారు. రైతుల ఆదాయం రెట్టింపు, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, అవినీతి నిర్మూలన ఇలా ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేకపోగా, అందుకు విరుద్ధంగా ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు అప్పగించారు. ఓడరేవులు, రైల్వే లైన్లు, విమానాశ్రయాలు, బ్యాంకులు, టెలికం, ఎల్‌ఐసి ఇలా అన్నీ ప్రైవేట్‌పరం అయిపోతున్నాయి. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి మూడు నల్లచట్టాలను తెచ్చింది. ఉపాధి హామీ పథకానికి 2.72 లక్షల కోట్లు అవసరం కాగా, కేవలం 73 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 25 సంవత్సరాల వారిలో 83 శాతం మందికి ఉద్యోగాలు దొరకడంలేదు. మరోవైపు సంపన్నుల సంపద భారీగా పెరుగుతున్నది. 2013లో అదానీ సంపద రూ.25,792 కోట్లు వుంటే 2022 నాటికి రూ.7,48,800 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో అంబానీ సంపద రూ.1,54,742 కోట్ల నుండి రూ.7,54,620 కోట్లకు చేరింది. వెయ్యి కోట్లకు పైగా ఆస్తులు వున్నవారి సంఖ్య 56 నుండి 169కి పెరిగింది. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ లాంటి 46 మంది బ్యాంకుల్లో వేల కోట్లు లూటీ చేశారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన ఎన్నికల బాండ్ల విధానం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీన పరచింది. చట్టసభల్లో కోటీశ్వరులు, నేరస్తులు పెరిగిపోతున్నారు. ప్రస్తుత పార్లమెంట్‌లో 43 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉండగా, 68 శాతం మంది కోటీశ్వరులు వున్నారు. కేంద్ర క్యాబినెట్‌లో 83 శాతం మంది కోటీశ్వరులే.

కార్పొరేట్లకు దోచిపెడుతూ, తమను ఎండబెడుతున్న ప్రభుత్వ విధానాలను ప్రజలు కచ్చితంగా ప్రతిఘటిస్తారనే విషయం పాలకులకు, వారిని నడుపుతున్న సంపన్నులకు తెలుసు. గతంలో కాంగ్రెసు అనుసరించిన అణచివేత పద్ధతి మాత్రమే చాలదని, దానితో పాటు ప్రజల ఐక్యతను, రోజువారి జీవిత సమస్యల నుండి దృష్టి మళ్ళించే మతతత్వవాదుల అవసరాన్ని వీరు గుర్తించారు. వారి అండదండలతో అధికారంలో కొనసాగుతున్న పాలకులు ఒకవైపు కార్మిక, ప్రజానుకూల చట్టాలను మార్చివేస్తూ, క్రూరమైన నిర్బంధానికి పాల్పడుతున్నారు. మరోవైపు ప్రజల మత విశ్వాసాలను ఉపయోగించుకుంటూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. వీటికి మీడియాను యథేచ్ఛగా వాడుకుంటున్నారు. రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా పని చేయాల్సిన న్యాయస్థానాలు, సిబిఐ, ఇ.డి, ఎన్నికల కమిషన్ లాంటి సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు. ఇలాంటి బహు రూపాల్లో తమకు సేవ చేయగలిగిన ప్రభుత్వం వీలైనంత ఎక్కువ కాలం వుండాలని దేశ, విదేశీ కార్పొరేట్ కంపెనీలు కోరుకుంటాయి. అందుకు అవసరమైన అన్ని రకాల అండదండలనిస్తాయి. అంతిమంగా ప్రజల జీవితాలు అడుగంటిపోతాయి. అయితే అందర్నీ అన్నివేళలా మోసగించలేరు. ప్రజలు వాస్తవాలను గుర్తించి తమ బాధలు తీర్చే మార్గం ఎంచుకుంటారు.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

అభిప్రాయం

కల్తీకి కళ్లెం ఎలా..!

హోటళ్లు, ఫుట్‌పాత్‌లపై నోరూరించే, ఘుమ ఘుమలాడే వంటకాల వెనక అనేక నాసిరకం ఆహార పదార్థాలు దాగి ఉంటున్నాయి. కనీస ప్రమాణాలు పాటించ కుండా మాంసా హారాన్ని నిల్వ ఉంచుతున్నారు. వాటికే రంగులద్ది మళ్లీ మళ్లీ నూనెలో వేయించి...వేడివేడిగా పొగలు కక్కిస్తూ వడ్డిస్తున్నారు. పలు చోట్ల రోగాల బారిన పడిన జంతువుల మాంసాన్ని సైతం వినియోగించిన ఘటనలు వెలుగు చూశాయి. నాసిరకం నూనెలు, అనుమతి లేని రంగులను మితిమీరి వాడుతున్నారు.

కల్తీ ఆహారం వల్ల అతిసారం నుంచి క్యాన్సర్ల వరకు దాదాపు 200 రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు. ఆహార పదార్థాల తయారీలో రుచి, రంగు కోసం హానికరమైన రసాయనాలు, రంగులను కలుపుతుండడంతో దేశంలో సుమారు 10 కోట్ల మంది వివిధ వ్యాధులతో బాధ పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 2030 నాటికి ఈ సంఖ్య 15 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది.

వంట నూనెల నియంత్రణ చట్టం-1947, నిత్యావసర సరకుల నియంత్రణ చట్టం-1955, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం-1992 వంటివి క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలుకు నోచుకోవడంలేదు. ఆహారం కల్తీ చేయటం, నాసిరకం పదార్థాలు అమ్మటం నేరమని ఆహార భద్రతా ప్రమాణాల చట్టం-2006 చెబుతున్నది. ఆహార కల్తీ నిరోధక చట్టం-1954 కఠిన శిక్షలను నిర్దేశించింది. ఆహార, పానీయాలను కల్తీ చేసి అమ్మేవారికి ఆరు నెలల తప్పనిసరి జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించాలని పార్లమెంటరీ ప్యానెల్ సైతం ఏడాది క్రితం సిఫారసు చేసింది. అయితే హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తూ.. కలుషిత ఆహారాన్ని గుర్తిస్తున్నా.. వారికి శిక్షలు మాత్రం పడడం లేదు. జరిమానాలతో బయటికొచ్చి మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం నాసిరకం ఆహారం అని తేలితే జాయింట్ కలెక్టర్ సమక్షంలో నేరస్తుడిని ప్రవేశపెట్టి జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష వేసే అవకాశం ఉంది. సబ్ స్టాండర్డ్ కేసుల్లో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకూ జరిమానా చెల్లించి నేరస్తులు బయట పడుతున్నారు. కల్తీ ఆహారం అని తేలితే క్రిమినల్ కేసు బుక్ చేయాలి. వారికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ కల్తీ ఆహారం తిని ఎవరైనా చనిపోయినట్లు నిరూపించగలిగితే గరిష్టంగా ఏడేళ్ల శిక్ష విధించేందుకు చట్టంలో సెక్షన్లున్నాయి. ఇన్ని శిక్షలున్నా కల్తీ నిరాఘాటంగా జరిగిపోతూనే వుంది.

కల్తీ ఆహారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కదలాలి. నిఘా పెరగాలి. తనిఖీ నిరంతరం కొనసాగాలి. కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజలలో సైతం చైతన్యం పెరగాలి. అప్పుడే ఈ కల్తీకి కళ్లెం వేయగలం!

- ఫిరోజ్ ఖాన్,
సెల్ : 9640466464

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కులీనుల గుప్పెట్లో అమెరికా!

వ్యాఖ్య

ఈ సారి అధ్యక్ష ఎన్నికలలో 150 బిలియనీర్ కుటుంబాలు 2 బిలియన్ డాలర్లు ఖర్చు చేశాయి. ఎలన్ మస్క్ ఒక్కడే డొనాల్డ్ ట్రంప్‌కి దన్నుగా 277 మిలియన్ డాలర్లు ఖర్చు చేశాడు. 'ఒక్కడే 277 మిలియన్ డాలర్లు ఖర్చు చేశాడా?' అని ఆశ్చర్యపడకండి. అది అతని పెట్టుబడి. అందుకు తగిన ప్రతిఫలంగా కాంట్రాక్టులు దక్కించుకున్నాడు (ప్రభుత్వంలో పదవి కూడా). ఆయుధ తయారీ పరిశ్రమాధిపతులు ఈ ఎన్నికలలో 38 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. ఇందుకుగాను రక్షణ వ్యయానికి కేటాయించే బిలియన్ల కొద్దీ డాలర్లలో తమ వాటా సంపాదించుకుంటారు.

విచిత్రం ఏంటంటే రాజకీయ నాయకులు, మీడియా రష్యా గురించి గానీ, పుతిన్ గురించి గానీ మాట్లాడాల్సి వచ్చినప్పుడు 'కులీన పరిపాలన' అన్న పదం తరచూ వాడుతుంటారు. పుతిన్ హయాంలో కులీనులు మహా శక్తివంతంగా ఎలా తయ్యారో కూడా వివరిస్తుంటారు. కానీ అమెరికాలోను, ఇతర దేశాల్లోను జరుగుతున్న వ్యవహారాలను ఉదహరించేటపుడు ఇదే 'కులీన పరిపాలన' అన్న పదం మనకు చాలా అరుదుగా వినబడుతుంటుంది. నిజానికి 'కులీన పరిపాలన' అనేది ప్రపంచవ్యాప్త నైజంగా చలామణి అవుతున్నది. దీని ప్రధాన స్థావరం అమెరికానే. వాస్తవం ఇదే. కానీ ఈ నిజాన్ని ఇక్కడ మాట్లాడడానికి ఎవరూ ఇచ్ఛగించరు. అతి కొద్ది మంది శత కోటీశ్వరులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సింహ భాగాన్ని స్వంతం చేసుకుని నియంత్రిస్తున్నారు. ఈ మాటకు తిరుగు లేదు. అంతే కాదు! వాళ్లే ఇవాళ అవినీతికర ప్రచార ఆర్థిక వ్యవస్థ ద్వారా అమెరికన్ ప్రభుత్వాన్ని స్వంతం చేసుకుని, నియంత్రిస్తున్నారు. 2020వ సంవత్సరం నుండి లెక్క తీస్తే ప్రపంచంలో 50 కోట్ల మంది ప్రజానీకం పేదరికంలోకి జారిపోతే, కేవలం ఐదుగురు అతి సంపన్నులు గంటకు 14 మిలియన్ డాలర్ల సంపాదనతో తమ సంపదను, రెట్టింపు చేసుకున్నారు. ప్రపంచంలో అత్యంత సంపన్న శ్రేణిలో ముందు వరుసలో ఉన్న ఎలన్ మస్క్ ఎన్నికల రోజు నుండి ఈ రోజు వరకు 120 బిలియన్ డాలర్ల ఆదాయం గడించాడు. 120 బిలియన్ డాలర్లు. అర్థమవుతుందా! ఆ తరువాత వరుసలో ఉన్న జెఫ్ బెజోస్ (అమెజాన్) గత నెలలో 67 బిలియన్ డాలర్లు పోగేసుకున్నాడు. మార్క్ జుకర్‌బర్గ్ (మెటా-ఫేస్‌బుక్, వాట్సప్ అధిపతి) ఈ ఏడాది 90 బిలియన్ డాలర్ల సంపద పోగేసుకున్నాడు. అంటే ప్రపంచంలోనే అత్యంత సంపన్నులైన శత కోటీశ్వరులు అనూహ్యమైన స్థాయిలో సంపద పోగేసుకుంటున్నారు.



బెర్నీ శాండర్స్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంపన్నులలో పైశ్రేణి 1 శాతం మంది ఒక్క దశాబ్ద కాలంలో 42 ట్రిలియన్ డాలర్ల సంపదను కైవశం చేసుకున్నారు. ఇదే దశాబ్ద కాలంలో 50 శాతం మంది అట్టడుగు స్థాయి ప్రజానీకం జీవన ప్రమాణాలు ఏ మాత్రం మెరుగు పడలేదు. ఇంకా స్పష్టంగా చెప్పుకోవాలంటే ఈ భూమి మీద ఉన్న 95 శాతం జనాభా సంపద కన్నా 1 శాతం ప్రపంచ కుబేరుల సంపద హెచ్చుగా ఉన్నది.

పన్ను రహిత స్వర్గధామాలుగా పిలవబడే కేమాన్ దీవులలో ఈ ప్రపంచ కుబేరులు 32 ట్రిలియన్ డాలర్లు దాచిపెట్టుకున్నారు. అంటే ప్రభుత్వాలకు చెల్లించాల్సిన పన్నులు ఎగవేశారన్నమాట. ప్రభుత్వమేమో నిధుల కొరతతో సతమతం అవుతుంటుంది. వీళ్లు మాత్రం ఎగవేసిన పన్నులను బొక్కసాలలో దాచిపెట్టుకుంటూ వుంటారు. వీళ్లు తమ సంపదను కాపాడుకోడానికి 'పలుకుబడిని' కొనుగోలు చేస్తారు. మరీ ముఖ్యంగా ఎన్నికలను కూడా.

అమెరికాలో అపర కుబేరుల సంఖ్య మొత్తం జనాభాలో 0.0005 శాతం. వాస్తవానికి వీళ్ల లెక్కలోకి రారు. కాని వీళ్లు 2024 అధ్యక్ష ఎన్నికల వ్యయంలో 18 శాతం ఖర్చు భరించారు. వాళ్లు ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది ఈ ఎన్నికలను కొనుగోలు చెయ్యడానికే. ఈ సారి అధ్యక్ష ఎన్నికలలో 150 బిలియనీర్ కుటుంబాలు 2 బిలియన్ డాలర్లు ఖర్చు చేశాయి. ఎలన్ మస్క్ ఒక్కడే డొనాల్డ్ ట్రంప్‌కి దన్నుగా 277 మిలియన్ డాలర్లు ఖర్చు చేశాడు. 'ఒక్కడే 277 మిలియన్ డాలర్లు ఖర్చు చేశాడా?' అని ఆశ్చర్యపడకండి. అది అతని పెట్టుబడి. అందుకు తగిన ప్రతిఫలంగా కాంట్రాక్టులు దక్కించుకున్నాడు (ప్రభుత్వంలో పదవి కూడా). ఆయుధ తయారీ పరిశ్రమాధిపతులు ఈ ఎన్నికలలో 38 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. ఇందుకుగాను రక్షణ వ్యయానికి కేటాయించే బిలియన్ల కొద్దీ డాలర్లలో తమ వాటా సంపాదించుకుంటారు. అవినీతి మార్గాల్లో ఎంత ప్రజాధనం దుబారా అవుతోందో గమనించండి. ఎయ్‌పాక్ (ఎ.ఐ.పి.ఎ.సి) సంస్థ ఇజ్రాయిల్, నెతన్యాహు పచ్చి మితవాద విధానాల పట్ల, గాజా హత్యాకాండ పట్ల విమర్శనాత్మకంగా వ్యవహరించిన సెనెటర్‌ను ఓడించడానికి 100 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇప్పుడు అమెరికాలో నడుస్తున్నది ప్రజాస్వామ్యం కాదని అర్థం చేసుకోవడానికి మీకు రాజకీయ అర్థశాస్త్రంలో పి.హెచ్.డి పట్టా ఉండాల్సిన అవసరం లేదు. ఇది ఒక వ్యక్తి, ఒక ఓటు స్వామ్యం కాదు. ఓ గుప్పెడు మంది మన భవిష్యత్తును నిర్ణయిస్తున్నారు. దీనినే 'కులీన పరిపాలన' అంటాం. ఈ కులీన శక్తులే అమెరికాలోనూ, ప్రపంచంలోని ఇతర దేశాల్లోనూ రాజ్యం చేస్తున్నాయి. ఈ కులీన శక్తులే పర్యావరణం, పేదరిక నిర్మూలన, కార్మిక కుటుంబాల జీవన ప్రమాణాల్లో మెరుగుదల వంటి అన్ని అంశాలలో ప్రభుత్వ విధానాలను శాసిస్తాయి. రాబోయే కొద్ది నెలల్లో ఈ కులీన శక్తులు మన రోజువారీ జీవితంపై ఎలాంటి ప్రభావం చూపించబోతున్నాయి? ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగవేసి అక్రమ సంపదను ఎలా దోచుకని దాచుకుంటున్నాయి. ట్రంప్ అధికార యంత్రాంగాన్ని ఏ విధంగా ప్రభావం చూపబోతున్నాయి? అనే అంశాలపై ప్రజానీకాన్ని చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాలి. సమాజం పట్ల ఆపేక్ష ఉన్న వారంతా ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నా.

/ వ్యాసకర్త అమెరికన్ రాజకీయవేత్త, వెర్మోంట్ సెనెటర్ /

జార్ఖండ్‌లోని రాంచిలో అమిత్ షా దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న నిరసనకారులు

ఢిల్లీలో మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న డిఎస్ఎంఎం కార్యకర్తలు

మనుస్మృతి మానవాళికి మరణ శాసనం

- మనువాద జాఢ్యంతోనే అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా
- దేశవ్యాప్తంగా పలుచోట్ల మనుస్మృతి ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మనుస్మృతి మానవాళికి మరణ శాసనం లాంటిదని పలువురు వక్తలు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా బుధవారం పలుచోట్ల వామపక్షాలు, వివిధ ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కరిస్టుల ఆధ్వర్యంలో 'మనుస్మృతి దహన దినం' పాటించారు. ఈ ఏడాది మనుస్మృతి పత్రాలతో పాటు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను కూడా తగులపెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలు, సమావేశాలు, నిరసన ప్రదర్శనల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్ షాను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ప్రొఫెసర్ రతన్ లాల్ ప్రసంగించారు. మనుస్మృతి.. కుల వ్యవస్థను చట్టబద్ధం చేసిన అత్యంత ప్రమాదకరమైన అంశంగా ఆనాడే అంబేద్కర్ నొక్కిచెప్పారని వెంకట్, రతన్‌లాల్ గుర్తు చేశారు. ఇది అణగారిన ప్రజలకే కాకుండా సమస్త సమాజ వినాశనానికి దారితీసే దుర్మార్గమైన అంశమని హెచ్చరించారు. 97 ఏళ్ల క్రితం మనుస్మృతిని దగ్ధం చేయడం ద్వారా దాని ప్రమాదాన్ని ముందు తరాలు మేల్కొనేటట్లు చేశారని గుర్తు చేశారు. అందుకే రాజ్యాంగ రచన సమయంలో లౌకికతత్వం, సామాజిక న్యాయం, అంటరానితనం నిషేధానికి అంబేద్కర్ అంతటి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. మహిళల సమానత్వాన్ని కోరుకున్నారని, ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. మతోన్మాదంతో పాటు మత ఛాందస్సాన్ని కూడా అంబేద్కర్ జీవితాంతం వ్యతిరేకిస్తూ వచ్చారని స్మరించుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం స్థానంలో అత్యంత ప్రమాదకరమైన మనుస్మృతిని తీసుకొచ్చేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమిత్ షా ఇటీవల అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఆర్‌ఎస్ఎస్, హిందుత్వ వాదులు రాజ్యాంగాన్ని విచ్ఛిన్న చేయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. అందుకు అంబేద్కర్ ఆటంకంగా ఉన్నారని, కాబట్టి బరితెగించి అమిత్ షా నిండు సభలో అంబేద్కర్‌ని అవమానించారని పేర్కొన్నారు. అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) నేత నత్తు ప్రసాద్, ఎఐఎడబ్ల్యుయు నేత విక్రమ్ సింగ్, అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నేత కృష్ణ ప్రసాద్, నిర్మల్ తదితరులు పాల్గొన్నారు. వర్ణ సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్ది అణగారిన ప్రజల పట్ల, మహిళల పట్ల తీవ్ర అణిచివేతకు దారితీసిన మనుస్మృతిని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. మానవాళికి ఇది ప్రమాదకరమైనదని హెచ్చరిస్తూ 1927 డిసెంబర్ 25న మనుస్మృతి ప్రతులను ఆయన దగ్ధం చేశారు. దేశ రాజకీయ చరిత్రలో ఈ ఘటనకు ఎంతో విశిష్టత ఉంది. నాటి ఘటనను స్మరించుకుంటూ మనువాద ప్రమాదాన్ని గుర్తు చేస్తూ ప్రతి యేటా డిసెంబరు 25న మనుస్మృతి దహన దినం పాటిస్తున్న సంగతి తెలిసిందే.

మెహ్రౌలి పార్క్‌లో కట్టడాలకు మత ప్రాధాన్యత

- సుప్రీం కోర్టుకు తెలియజేసిన పురావస్తు శాఖ

న్యూఢిల్లీ : మెహ్రౌలి ఆర్కియాలాజికల్ పార్క్‌లోని రెండు కట్టడాలకు మతపరమైన ప్రాధాన్యత వుందని భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ) సుప్రీం కోర్టుకు తెలియచేసింది. అషిక్ అల్లా దర్గా, 13వ శతాబ్దపు సూఫీ సన్యాసిగా గౌరవించబడిన బాబా ఫరీద్ చిల్లాగ్‌లను ప్రతి రోజూ ముస్లింలు సందర్శిస్తున్నారని పేర్కొంది. ఈ కట్టడం 1317 ఎడిలో నిర్మితమైందని అషిక్ అల్లా సమాధిపై రాసిన శాసనం బట్టి తెలుస్తోందని సుప్రీం కోర్టుకు అందచేసిన నివేదికలో ఎఎస్ఐ పేర్కొంది. నిర్మాణపరమైన మార్పులు, పునరుద్ధరణ, పరిరక్షణ కోసం చేసే చేర్పులు, మార్పులు వల్ల ఈ ప్రదేశం చారిత్రక ప్రాధాన్యత దెబ్బతింటుందని ఎఎస్ఐ పేర్కొంది. ఈ సమాధి పృధ్విరాజ్ చౌహాన్ స్మారకానికి దగ్గరగా వుందని, ప్రాచీన కట్టడాలు, పురావస్తు ప్రాంతాల చట్టం ప్రకారం 200మీటర్ల క్రమబద్ధీకరణ జోన్ పరిధిలో వుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎలాంటి మరమ్మత్తులు లేదా పునరుద్ధరణ పనులు చేపట్టాలంటే ముందస్తుగా అధికారుల నుండి అనుమతిని తీసుకోవాల్సి వుందని ఎఎస్ఐ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ రెండు కట్టడాల వద్దకు ప్రతి రోజూ భక్తులు వస్తున్నారని, దీపాలు వెలిగించి తమ కోర్కెలు తీర్చాలని ప్రార్ధిస్తున్నారని, అందువల్ల ఈ ప్రాంతం మతపరమైన విశ్వాసాలతో ముడి పడి వుందని భావించాల్సి వస్తుందని పేర్కొంది.

పార్లమెంట్ సాక్షిగా.. నిప్పంటించుకుని ఆత్మాహత్యాయత్నం

న్యూఢిల్లీ : ఏం కష్టమొచ్చిందో ఏమో.. ఒక వ్యక్తి ఏకంగా పార్లమెంట్ ముందే నిప్పు అంటించుకుని అత్యాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, రైల్వే పోలీసులు అతడ్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. 95 శాతం గాయాలైన అతని పరిస్థితి విషమంగా ఉందని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి వైద్యులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో పార్లమెంట్‌కు ఎదురుగా ఉండే రైల్వే భవన్ సమీపంలోని పార్క్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడి వద్ద పాక్షికంగా కాలిపోయిన రెండు పేజీల సూసైడ్ నోట్‌ను గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లోని బాఘ్‌పట్‌కు చెందిన జితేంద్రగా బాధితుడ్ని గుర్తించారు. కుటుంబ ఆర్థిక సమస్యలే దీనికి కారణమని భావిస్తున్నారు.

ప్రయివేటు రైలు ఆలస్యానికి పరిహారం బంద్

- ఆర్టీఐ సమాధానంతో వెల్లడి

న్యూఢిల్లీ : ప్రయివేటు రైళ్ల ఆలస్యమైనందుకు ప్రయాణికులకు పరిహారం అందించే పథకాన్ని భారత రైల్వే నిలిపివేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే దీనిని ఆపేసింది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద వార్తా సంస్థ పీటీఐ దాఖలు చేసిన దరఖాస్తుకు స్పందనగా భారత రైల్వేకు చెందిన ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) నుంచి ఈ సమాచారం అందింది. ఐఆర్‌సీటీసీ ప్రకారం.. ఈ పథకం కింద 2019 అక్టోబర్ 4 నుంచి 2024 వరకు ప్రయాణికులకు రూ.26 లక్షల పరిహారం అందింది. 2023-24లోనే ప్రయాణికులకు రూ.15.65 లక్షల పరిహారం అందించింది. ప్రయివేటు రైళ్ల ఆలస్యం విషయంలో పరిహారాన్ని అందించే పథకం 2024, ఫిబ్రవరి 15 నుంచి నిలిపివేయబడిందని ఐఆర్‌సీటీసీ వివరించింది. అయితే, ఇది నిలిపివేయటానికి గల కారణాన్ని వెల్లడించటానికి నిరాకరించింది. ఇది గోప్యమని పేర్కొనటం గమనార్హం. ఐఆర్‌సీటీసీ రెండు తేజస్ రైళ్లను నడుపుతున్నది. ఒకటి.. న్యూఢిల్లీ నుంచి లక్నో వరకు, ఇంకొకటి.. అహ్మదాబాద్ నుంచి ముంబయికి నడుస్తున్నాయి.

ఎన్నికల నిబంధనల సవరణలపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ రికార్డులు అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు అందుబాటులో లేకుండా చేస్తూ ఎన్నికల నిర్వహణ నిబంధనలకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సవరణలను కాంగ్రెస్ పార్టీ మంగళవారం సుప్రీంకోరులో సవాల్ చేసింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఈ మేరకు పిటీషన్ వేశారు. ఎన్నికల నిర్వహణా నిబంధనలు 1961లోని రూల్ 93లోని సబ్-రూల్ (2)ను సవరించినట్లు ఈ నెల 20న కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. పాత నిబంధనల ప్రకారం ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులు, వీడియోలు, ట్రయల్స్ ను ఎలాంటి మినహాయింపు లేకుండా రాజకీయ పార్టీల పరిశీలనకు ఎన్నికల సంఘం అనుమతించేది. ఇప్పుడీ సవరణతో అ అవకాశం లేకుండా చేశారు. పోలింగ్ బూత్‌ల సిసిటివి కెమెరా ఫుటేజు, వీడియో రికార్డింగులను అభ్యర్థికి అందచేయాలని ఇటీవల పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశించిన తర్వాత కేంద్రం ఏకపక్షంగా ఈ సవరణలు తీసుకొచ్చింది.. ఈ సవరణలతో ఎన్నికల సమగ్రత దెబ్బతింటోందని తెలిపారు. స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలను నిర్వహించడం రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ బాధ్యత. దానికి భిన్నంగా తీసుకొచ్చిన ఈ సవరణను ఎంతమాత్రమూ అనుమతించకూడదని జైరాం రమేష్ ఆ పిటిషన్‌లో వాదించారు.. ఎన్నికల ప్రక్రియ మరింత జవాబుదారీగా, పారదర్శకంగా వుండేందుకు వెసులుబాటు కల్పించే ముఖ్యమైన సమాచారాన్ని ఈ సవరణతో ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ నిబంధనల్లో సవరణలపై దేశవ్యాప్తంగా విమర్శలు వస్తున్నా ప్రభుత్వం లెక్కచేయడం లేదు. ఈ సవరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం ఇప్పటికే డిమాండ్ చేసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఒత్తిడితోనే ఇసి ఈ సవరణలు చేసిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శించారు.

పర్భనీలో పోలీసు కస్టడీలో హత్యకు గురైన విద్యార్థి కుటుంబానికి సిపిఎం బృందం పరామర్శ

సోమ్‌నాథ్ సూర్యవంశీ కుటుంబాన్ని పరమర్శిస్తున్న సిపిఎం నేతలు

ముంబయి : మహారాష్ట్రలోని పర్భనిలో పోలీసు కస్టడీలో హత్యకు గురైన న్యాయ విద్యార్థి సోమ్‌నాథ్ సూర్యవంశీ కుటుంబాన్ని సిపిఎం ప్రతినిధి బృందం బుధవారం పరామర్శించింది. కుటుంబ సభ్యులను ఓదార్చి అన్నివేళలా అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. పర్భనిలో రాజ్యాంగ ప్రతిమ ధ్వంసాన్ని ఖండిస్తూ ప్రదర్శనలు నిర్వహించిన ప్రజాస్వామ్యవాదులపైనా, దళితులపైనా పోలీసులు దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగానే పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో సూర్యవంశీ కూడా ఉన్నారు. కస్టడీలో చిత్రహింసలకు గురి చంపేశారు. పోస్టుమార్టం నివేదికలోనూ వంశీది హత్యేనని తేలింది. దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని బిజెపి-ఎన్‌డిఎ ప్రభుత్వం అందించిన రూ .10 లక్షల నష్ట పరిహారాన్ని సోమ్‌నాథ్ కుటుంబం తిరస్కరించింది. దానికి బదులుగా సోమ్‌నాథ్ హత్యకు కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ ప్రతిమ ధ్వంసం విషయం తెలిసి దిగ్భ్రాంతికి గురై స్థానిక దళిత సంఘం నేత విజయ్ వాకోడే గుండెపోటుతో చనిపోయారు. ఆయన కుటుంబాన్ని కూడా సిపిఎం బృందం పరామర్శించింది. ఈ బృందంలో సిపిఎం పర్భని జిల్లా కార్యదర్శి ఉద్ధవ్ పౌల్, నాయకులు రాంరాజే మహదీక్, నాసిర్ షేక్, బీడ్, బభ్రువాహన్ పోత్భారే ఉన్నారు.

యుద్ధాలు వద్దు...శాంతే ముద్దు

పోప్ ఫ్రాన్సిస్ క్రిస్మస్ సందేశం

వాటికన్ సిటీలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులతో ముచ్చటిస్తున్న పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ బుధవారం ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చారు. వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికా బాల్కనీ నుంచి వేలాది మంది ప్రజలకు ఆయన సంప్రదాయ సందేశాన్ని అందిస్తూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావించారు. మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధానికి స్వస్తి చెప్పేందుకు రెండు దేశాలు చర్చలు జరపాలని పిలుపునిచ్చారు. 'యుద్ధం కారణంగా అతలాకుతలమవుతున్న ఉక్రెయిన్‌లో ఆయుధ శబ్దాలు ఆగిపోవాలి. న్యాయసమ్మతమైన, చిరకాల శాంతి కోసం రెండు దేశాలు సంప్రదింపులు జరపాలి' అని ఆకాంక్షించారు. క్రిస్టమస్ రోజున ఉక్రెయిన్‌పై రష్యా దాడులు జరిపిన నేపథ్యంలో పోప్ ఇచ్చిన సందేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉక్రెయిన్ ఇంధన గ్రిడ్‌ను లక్ష్యంగా చేసుకొని రష్యా జరిపిన దాడిలో అనేక మంది గాయపడ్డారు. లెబనాన్, మాలీ, మొజాంబిక్, హైతీ, వెనిజులియా, నికరాగ్వువా సహ ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న రాజకీయ, సామాజిక, సైనిక ఘర్షణలకు స్వస్తి చెప్పాలని 88 సంవత్సరాల పోప్ ఫ్రాన్సిస్ ఉద్బోధించారు. యుద్ధాల గురించి, పాఠశాలలు, ఆస్పత్రులపై జరుగుతున్న బాంబు దాడులను గురించి ఆలోచించాలని ఆయన ఈ సందర్భంగా క్రైస్తవులను కోరారు.

గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక దాడులను పోప్ ఇటీవల తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయిల్ చర్యను క్రూరత్వంగా ఆయన గత వారం అభివర్ణించారు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న మిగిలిన ఇజ్రాయిలీలను విడుదల చేయడం కోసం ఇజ్రాయిల్-హమాస్‌లు కాల్పుల విరమణ పాటించాలని కోరారు. గాజాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అంటూ చర్చలు, శాంతి స్థాపనకు మార్గం సుగమం చేయాలని పోప్ సూచించారు.

గాజాలో మరో 23 మంది మృతి

గాజా : గాజాలో ఇజ్రాయిల్ అమానవీయ దాడులు బుధవారం కూడా కొనసాగాయి. ఈ దాడుల్లో 23 మంది పాలస్తీనియన్లు మరణించారు. 39 మంది గాయపడ్డారు. బుధవారం క్రిస్మస్‌ను పురస్కరించుకుని గాజాలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

ఇజ్రాయిల్ హత్యా, విధ్వంసకాండకు ఇకనైనా ముగింపు పలికేలా చూడాల్సిందిగా వారు వేడుకున్నారు. జీసస్ జన్మస్థలమైన వెస్ట్‌బ్యాంక్ నగరమైన బెత్లెహామ్‌లో చాలామంది తమ ప్రార్థనలను బాధితులకు అంకితం చేశారు. గత 14 మాసాలుగా దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో వైఫల్యానికి కారణమంటూ ఇజ్రాయిల్, హమాస్‌లు పరస్పరం విమర్శించుకుంటున్నాయి. మరోవైపు హిజ్బుల్లాతో కాల్పుల విరమణ విషయంలో తీవ్ర ఉల్లంఘనలు జరగకుండా చూసేలా, దేశ దక్షిణ ప్రాంతం నుండి వైదొలగేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలంటూ లెబనాన్ ప్రధాని నజీబ్ మికాతి, అమెరికా, ఫ్రాన్స్ నేతృత్వంలోని పర్యవేక్షక కమిటీని కోరారు. ఆహార సరఫరాలను ఇజ్రాయిల్ దాదాపుగా నిషేధించడంతో ఉత్తర గాజాలో కరువు పురి విప్పుతోందని ఆహార సంక్షోభ పర్యవేక్షక సంస్థ పేర్కొంది. ఇప్పటివరకు గాజాలో 45,361 మంది మరణించగా, 1,07,803మంది గాయపడ్డారు.

మొజాంబిక్‌లో ఎన్నికల హింస

- 21 మంది మృతి

మాపుటో : వివాదాస్పదంగా మారిన మొజాంబిక్ ఎన్నికల్లో పాలక పార్టీ ఫ్రిలిమో విజయం సాధించిందని సుప్రీం కోర్టు ధ్రువీకరించడంతో దేశవ్యాప్తంగా అశాంతి చెలరేగింది. ఈ సందర్భంగా చోటు చేసుకున్న హింసాకాండలో 21మంది మరణించారని హోం శాఖ వర్గాలు తెలిపాయి. మరణించిన వారిలో ఇద్దరు పోలీసు అధికారులు కూడా వున్నారని హోం మంత్రి పాస్కోల్ రోండా చెప్పారు. అక్టోబరులో జరిగిన ఈ ఎన్నికలకు సంబంధించి సోమవారం కోర్టు ధృవీకరణ వెలువడింది. అప్పటి నుండి సరికొత్తగా నిరసనలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుండి ఇప్పటివరకు 236 హింసాత్మక చర్యలు చోటు చేసుకున్నాయి. 13 మంది పోలీసు అధికారులతో సహా 25 మంది గాయపడ్డారని హోం మంత్రి తెలిపారు. ఫ్రిలిమో విజేత అని రాజ్యాంగ మండలి ధృవీకరించిన వెంటనే ఈ నిరసనలు వెల్లువెత్తాయి. అక్టోబరు 9న జరిగిన ఈ ఎన్నికల్లో రిగ్గింగ్ బాగా జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటివరకు 78మందిని అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. కీలకమైన ప్రాంతాల్లో సాయుధ బలగాల మోహరింపు చేసినట్లు చెప్పారు. ప్రత్యర్థులు, ఎన్నికల పరిశీలకు పదే పదే రిగ్గింగ్‌కు పాల్పడినట్లు ఫ్రిలిమో పై ఆరోపణలు చేసినా, ఆ పార్టీ మాత్రం వీటిని తిరస్కరిస్తూ వస్తోంది.

హసీనాపై కక్ష సాధింపు చర్యలు

- ఆమె కుమారుడు వజీద్ విమర్శ

వాషింగ్టన్ : అవామీ లీగ్ నాయకత్వంపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడేందుకు జ్యుడీషియరీని ఒక సాధనంగా ఉపయోగిసున్నారని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వజీద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని కోరుతూ భారత్‌కు లేఖ రాశామని సోమవారం తాత్కాలిక ప్రభుత్వం పేరొన్న రెండు రోజుల తర్వాత వజీద్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున విద్యార్థులు నిరసనలకు దిగడంతో ఈ ఏడాది ఆగస్టు 5న హసీనా బంగ్లాదేశ్ నుండి పారిపోయి భారత్‌లో నివసిస్తున్నారు. మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు, ఊచకోతకు పాల్పడినందుకు హసీనా, పలువురు మాజీ మంత్రులు, సలహాదారులు, మిలటరీ, పౌర మాజీ నేతలపై బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ అరెస్టు వారంట్లు జారీ చేసింది. హసీనాపై విచారణ చేపట్టేందుకు యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం న్యాయమూర్తులను, ప్రాసిక్యూటర్లను నియమించడాన్ని ప్రస్తావిస్తూ వజీద్ ఇదొక రాజకీయ కక్ష సాధింపు చర్య అని విమర్శించారు. అవామీ లీగ్ నాయకత్వాన్ని వేధించేందుకు ఇది మరొక ప్రయత్నమని వ్యాఖ్యానించారు. హసీనాకు వ్యతిరేకంగా ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు జారీ చేసిందంటూ తప్పుడు ప్రచారాన్ని ఉద్దేశ్యపూర్వకంగా వ్యాప్తి చేస్తున్నారని వజీద్ విమర్శించారు. అమెను స్వదేశానికి రప్పించి, యూనస్ ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకు ఒక ప్రహసనంగా విచారణను చేపట్టాలని భావిస్తున్నారని విమర్శించారు.

ప్రముఖ మలయాళ రచయిత వాసుదేవన్ నాయర్ కన్నుమూత

కోజికోడ్ : ప్రముఖ మలయాళ రచయిత ఎంటి వాసుదేవన్ నాయర్ బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 91 ఏళ్లు. భారత దేశపు అత్యుత్తమ రచయితల్లో ఒకరిగా గుర్తింపు పొందిన వాసుదేవన్ నాయర్ సినిమా స్క్రీన్ ప్లే రైటింగ్ కళలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పొన్నాని సమీపంలోని కూడళ్లూరు అనే గ్రామంలో జన్మించిన వాసుదేవన్ చిన్నతనం నుంచే రచనలు సాగించారు. 29 ఏళ్లకే మళయాళ సాహిత్యంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. తరువాత తన అసాధారణమైన స్క్రిప్ట్ రైటింగ్‌తో సినిమాలకు కొత్త కొన్ని వన్నెలు తీసుకొచ్చారు. 1965లో మురప్పెన్ను అనే సినిమాకు మొదటిసారిగా స్క్రిప్ట్ రాశారు. కొన్ని చిత్రాలకు వాసుదేవన్ స్వయంగా దర్శకత్వం కూడా వహించారు. దర్శకుడిగా తొలి సినిమానే (1974, నిర్మాల్యం) జాతీయ ఉత్తమ చిత్రంగా అవార్డు గెలుచుకుంది. అయినా సరే వాసుదేవన్ సినిమాలకు దర్శకత్వం వహించడంపై పెద్దగా ఆసక్తి కనబర్చలేదు. ఒరు వడక్కన్ వీరగాథ, అమృతం గమ్య, పంచాగ్ని, పరిణయం, అక్షరంగల్, ఆల్యూట్టిటిల్ తనియే, తాజ్వారం వంటి సినిమాలు వాసుదేవన్ స్క్రిప్ట్‌తో క్లాసిక్స్‌గా మారాయంటే అతిశయోక్తి కాదు. అలాగే ఆయన రాసిన రండమూజం, అసురవిత్తు, మంజు, కాలం, నలుకెట్టు వంటి ఫిక్షన్ నవలలు ఇప్పటికీ దశాబ్దాల తరువాత కూడా పున ముద్రించబడుతన్నాయంటే అవి ఎంతగా ప్రాచుర్యం పొందాయో ఊహించుకోవచ్చు. నవలలతో పాటు చిన్న కథలను కూడా ఆయన రాశారు. వాసుదేవన్ అనేక రచనలు ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి. 1995లో జ్ఞాన్‌పీఠ్ అవార్డు గెలుచుకున్నారు.

మాతృభూమి పత్రికకు సంపాదకుడిగానూ వాసుదేవన్ బాధ్యతలు నిర్వహించారు. ఎడిటర్‌గా అనేక మంది యువ రచయితలకు మార్గదర్శకత్వం వహించారు.

సిపిఎం పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శిగా ఎస్ రామచంద్రన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శిగా ఎస్ రామచంద్రన్ ఎన్నికయ్యారు. పది మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికయింది. సిపిఎం పుదుచ్చేరి రాష్ట్ర 24వ మహాసభ పుదుచ్చేరిలోని సీతారాం ఏచూరి మెమోరియల్ హాల్‌లో జరిగింది. 223 మంది ప్రతినిధులు హాజరైన ఈ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్ తదితరులు ప్రసంగించారు. పుదుచ్చేరిలో వామపక్ష, ప్రజాస్వామ్య కూటమి ఐక్య పోరాటంతో ఎన్ఆర్‌కాంగ్రెస్ - బిజెపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఓడించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. బూర్జువా పార్టీల విధ్వంసక భావజాలాన్ని ఎదుర్కొనేందుకు కమ్యూనిజమే ఏకైక ఆచరణీయ ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఆర్ రాజంగం రాజకీయ, నిర్మాణ నివేదికను మహాసభలో ప్రవేశపెట్టారు. 37 మంది ప్రతినిధులు చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కమిటీ మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎస్ రామచంద్రన్‌తో పాటు 10 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకుంది.

సిపిఎం హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా సంజయ్ చౌహాన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా సంజయ్ చౌహాన్ ఎన్నికయ్యారు. 32 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక కాగా, తొమ్మిది మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికయింది. సిపిఎం హిమాచల్‌ప్రదేశ్ 18వ రాష్ట్ర మహాసభ సిమ్లాలోని కలిబారి హాల్‌లో జరిగింది. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ, తపన్ సేన్, ఎ విజయ్ రాఘవన్, కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్ సహ సీనియర్ నేతలు ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య విభజన రేఖను గీసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీన్ని తిప్పికొట్టేందుకు పార్టీని బలోపేతం చేయాలన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కష్టాల్లో ఉన్న ఆపిల్ రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని, తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కేంద్రం అండదండలతో ఆపిల్ మార్కెట్ అదానీ హస్తగతమైందన్నారు. మహాసభలో పార్టీ రాజకీయ, నిర్మాణ నివేదికను రాష్ట్ర కార్యదర్శి సంజయ్ చౌహాన్ ప్రవేశపెట్టారు. ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సిపిఎం మణిపూర్ రాష్ట్ర కార్యదర్శిగా క్షేత్రమయుం శాంత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం మణిపూర్ రాష్ట్ర కార్యదర్శిగా క్షేత్రమయుం శాంత ఎన్నికయ్యారు. 16 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికయింది. సిపిఎం మణిపూర్ 20వ రాష్ట్ర మహాసభ ఇంఫాల్‌లో సీతారాం ఏచూరి మెమోరియల్ హాల్‌లో జరిగింది. ఈ మహాసభలో 52 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సిపిఎం సీనియర్ నేత 101 ఏళ్ల నింతౌజం టోంబా లాల్ జెండాను ఎగురవేశారు. ఈ మహాసభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విజూ కృష్ణన్, సుప్రకాష్ తాలూక్దార్ పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి క్షేత్రమయుం శాంతా రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై 11 మంది ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 16 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీ ఎన్నిక అయింది. రాష్ట్ర కార్యదర్శిగా తిరిగి క్షేత్రమయుం శాంత ఎన్నిక అయ్యారు. రాష్ట్రంలో సాధారణ స్థితిని తీసుకురావడంలో కేంద్రం, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలు విఫలమయ్యాయని మహాసభ పేర్కొంది. ఘర్షణల కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు నెలకు రూ. 20 వేలు, రైతులకు పంట నష్టానికి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌తో కూడిన పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. మణిపూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఎఎఫ్ఎస్‌పిఎని పునరుద్ధరించడాన్ని వ్యతిరేకిస్తూ కూడా మహాసభ తీర్మానం చేసింది.

సైబర్ నేరాల నియంత్రణకు పరస్పర సహకారం

- కీలక ఒప్పందానికి ఐరాస ఆమోదం

ఐక్యరాజ్య సమితి : సైబర్ నేరాల నియంత్రణకు పరస్పర సహకారం అందించుకునేలా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ మంగళవారం ఒక కీలక ఒప్పందాన్ని ఆమోదించింది. సభ్య దేశాల మధ్య గత 20 ఏళ్ళలో కుదిరిన మొదటి అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ ఒప్పందమిది. చట్టబద్ధంగా కట్టుబడి వుండే ఈ ఒప్పందం సమాచారం, కమ్యూనికేషన్ సాంకేతికతలను దుర్వినియోగం చేయడం వల్ల తలెత్తే గణనీయమైన ముప్పులను గుర్తించింది. సమాచార సాంకేతికతను దుర్వినియోగం చేయడంతో అనూహ్యమైన రీతిలో, విస్తృత పరిధిలో, చాలా వేగంగా నేర కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయని ఒప్పందం పేర్కొంది. ఇటువంటి నేరాలు ప్రభుత్వాలపై, సంస్థలపై, వ్యక్తులపై కలగచేసే ప్రతికూల ప్రభావాలను ప్రముఖంగా పేర్కొంది. తీవ్రవాదం, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆన్‌లైన్ ఆర్థిక నేరాలు వంటి వాటి నుండి రక్షించడంపై ప్రధానంగా దృష్టి పెట్టింది. సైబర్ నేరాల బాధితులు పెరిగిపోతున్నారని ఈ ఒప్పంద పత్రం ఆందోళన వ్యక్తం చేసింది. సభ్య దేశాల మధ్య అవసరమైన సాంకేతిక సహకారం అందించుకోవాల్సిన, సహకరించుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. వచ్చే ఏడాది హనోయ్‌లో జరిగే కార్యక్రమంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయి. 90 రోజుల్లోగా అమల్లోకి వస్తుందని యుఎన్ పత్రికా ప్రకటన పేర్కొంది. సురక్షితమైన సైబర్ స్పేస్‌ను ఈ ఒప్పందం పెంపొందిస్తుందని, అన్ని దేశాలు ఇందులో చేరాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ పిలుపిచ్చారు.

మీకోసం

పచ్చి బఠానీలను ఉడికించేటప్పుడు చిటికెడు పంచదార కలిపితే రంగు మారకుండా ఉంటాయి.

జీవన సౌరభం

ప్రతిరోజూ నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.

గంటలబండి

ఆరోజు ఆదివారం కావడంతో చిన్ని వాళ్ళ తాతయ్యతో బట్టల దుకాణానికి వెళ్ళింది. దుకాణంలో వ్యాపారం మెండుగా జరుగుతున్న సమయంలో అనుకోకుండా కరెంటు షార్ట్ సర్క్యూట్ అయి, దుకాణంలో మంటలు చెలరేగాయి. అందరూ బయటకు పరుగులు తీశారు. చిన్నీ వాళ్ళ తాతయ్య 'గంటలబండికి ఎవరైనా ఫోన్ చేయండ'ని కేకలు వేశారు. చిన్నీకి గంటలబండి అని ఒకటుందా అని ఆశ్చర్యం కలిగింది. చుట్టుపక్కల వాళ్ళు నీరు, ఇసుక వేసి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు కానీ ప్రయోజనం లేదు. చిన్నీ అమాయకంగా వాళ్ళ తాతయ్య దగ్గరకెళ్లి 'తాతయ్య గంటలబండి అంటే ఏంటి? అది ఎలా ఉంటుంది!?' అని అడిగింది. దుకాణం కాలిపోతుందన్న బాధలో ఉన్న తాతయ్య, చిన్నీకి సమాధానం చెప్పలేదు. 'త్వరగా గంటలబండిని పిలిపించం'డని లబోదిబో మంటున్నారు. చిన్నీకి బట్టల దుకాణం కాలిపోతుందన్న ఆలోచన కన్నా గంటలబండిని చూడాలన్న ఆత్రుత పెరిగింది. ఇంతలో దూరం నుండి చిన్నీకి గంటల శబ్దం వినపడింది. 'హమ్మయ్య గంటలబండి వచ్చింద'ని ఎదురుగా వచ్చి ఆతృతతో నిలబడింది. దాన్ని చూడగానే చిన్నీకి అది 'ఫైర్ ఇంజన్' అని అర్థమైంది. 'ఓహో గంటలబండి అంటే ఫైర్ ఇంజనా!. నేనింకా ఏదో కొత్త రకం బండి అనుకున్నానే' అని తనలో తానే నవ్వుకుంది. గంటలబండి త్వరగా వచ్చి మంటలు అదుపుచేయడం వల్ల పెద్దగా నష్టం జరగలేదు. చిన్నీ, వాళ్ళ తాతయ్య, చుట్టుపక్కల దుకాణదారులు గంటలబండి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

– పుల్లట సంతోష్,
కవిటి, శ్రీకాకుళం జిల్లా,
89782 33949.

దేని నీడ ఏది?



పిల్లలూ, ఇక్కడ కొన్ని పక్షుల బొమ్మలు ఉన్నాయి. ఎదురుగా వాటి నీడలు ఉన్నాయి. దేని నీడ ఏదో కనిపెట్టి జతచేయండి.

నేను గీసిన బొమ్మ

టి.తనీష్,
6వ తరగతి,
కేంద్రీయ విద్యాలయం,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సమతుల ఆహారం తీసుకుంటున్నారా?



ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు పెద్దలు. అందుకే ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలంటే సరిపడా పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. పౌష్టికాహారం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోగలం. మన చుట్టూ లభించే తాజా ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు, మాంసకృత్తులు తదితర వాటిని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చు. పౌష్టికాహారం లోపిస్తే పలు రుగ్మతలు వేధిస్తాయి. చిన్నారులు, కౌమార బాల, బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపం ఎక్కువగా కనిపిస్తుంటుంది. బిడ్డ ఎదిగే క్రమంలో వయస్సులో తగిన ఆహారాన్ని అందించాలి.

పౌష్టికాహారమంటే...

మంచి ఆహారమే చక్కటి ఆరోగ్యానికి మార్గం. శక్తినిచ్చే పిండి పదార్థాలు, మాంసకృత్తులు (ప్రొటీన్లు), కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఇవి విరివిగా లభిస్తాయి. రాగి గంజి తరచూ తీసుకోవచ్చు. వేరుశెనగ విత్తనాల చెట్నీ, చిక్కీలు, రాగి ముద్ద వంటి వాటిని తీసుకుంటే ఐరన్ లభిస్తుంది. పాలకూర, మెంతి, బచ్చలకూర, గోంగూర, బెండకాయ, ములక్కాయ, టమాట, బీరకాయ వంటివి తీసుకోవటం శ్రేయస్కరం. సమతుల ఆహారం అంటే మన శరీరానికి అవసరమయ్యే పోషక పదార్థాలను తగిన పాళ్లల్లో అందించే ఆహారం. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు, నీరు మొదలైన పోషకాలు ఉండాలి. సగటు వ్యక్తికి రోజూ సుమారు 2000 వేల క్యాలరీలు అవసరం. అయితే ఇది వయస్సు, లింగం, శారీరక శ్రమస్థాయిని బట్టి మారుతుంది. మగవారికి ఆడవారికంటే ఎక్కువ క్యాలరీలు అవసరం. వ్యాయామం చేసే వారికి ఎక్కువ క్యాలరీలు కావాలి. గర్భిణులకు, బాలింతలకు కూడా అవసరమే. బాగా ఆటలాడే వారికి కార్బోహైడ్రేడ్లు ఎక్కువగా అవసరం. అదే శారీరక శ్రమ తక్కువగా ఉండి, ఎక్కువ సేపు కూర్చుని పనిచేసే వారికి క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు తక్కువ కావాలి. ఎదిగే పిల్లలకు ప్రొటీన్లు, క్యాల్షియం ఇంకా పలు రకాల విటమిన్లు అత్యవసరం. టీనేజీ దాటిన ఆడపిల్లలకు ఐరన్ ఎక్కువ ఉండే ఆహారం అవసరం. ప్రత్యేకించి ఒక పోషక పదార్థం కోసం, అంటే కేవలం ప్రొటీన్ల కోసం షేక్స్, విటమిన్ల కోసం సప్లిమెంట్లపై ఆధారపడకూడదు. వీలున్నంత వరకూ తీసుకునే ఆహారం ద్వారానే పొందాలి. దీనికి సమతుల్యమైన ఆహారం అవసరం. అందుకే వివిధ రకాల ధాన్యాలు, పప్పులు, గింజలు, కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పాల పదార్థాలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.

చలికాలంలో ఇలా...

చలికాలంలో రోగ నిరోధక శక్తి తగ్గి సీజనల్, ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుంది. విటమిన్లు, ఖనిజాలుండే సమతుల ఆహారం, ప్రోబయోటిక్స్, ప్రీ బయోటిక్స్ అధికంగా తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, చిలకడదుంప వంటివి ఎక్కువగా తినాలి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచేందుకు నీరు, హెర్బల్ టీలు, వెచ్చని సూప్‌లు తీసుకోవాలి. తగినంత నిద్ర, వ్యాయామం, శారీరక శ్రమ మానసిక స్థితిని రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.



వేరుశెనగ, బాదం, జీడిపప్పు, పిస్తా, ఖర్జూరం వంటివి తీసుకోవాలి. ఇవి బలవర్ధక ఆహారం. శరీరంలో వేడిని పుట్టిస్తాయి. యాపిల్, అరటిపండు, బొప్పాయి, ఫైనాపిల్ వంటివి తినాలి. వీటిలో ఫైబర్ ఉండి, వేడిని ఉత్పత్తి చేస్తాయి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, స్వీట్లు, కేసులు ఫ్రైడ్‌రైస్, ఆల్కాహాల్‌గా దూరంగా ఉండాలి.

డ్రైఫ్రూట్స్‌తోనూ ఎంతో మేలు

ఏడాది పొడవునా శరీరం చురుగ్గా ఉండాలంటే సూక్ష్మపోషకాలు చాలా అవసరం. ఆహారంలో అవి తగినంతగా లేనప్పుడు రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. పాల ఉత్పత్తులు, మాంసాహార ఉత్పత్తులు, తృణధాన్యాలు, చిరు ధాన్యాలను ఆహారంలో చేర్చుకోవాలి. శరీరానికి అవసరమైన పోషకాలను అందించాలి. సూక్ష్మపోషకాలతో పాటు, ప్రతిరోజూ ఫైబర్, నీరు అధికంగా ఉండే ఆహారాన్ని తినడం సమతుల్య శారీరక శ్రమను నిర్వహించడానికి సహాయపడుతుంది. తాజా పండ్లు, కూరగాయలు తినడం కూడా మంచిది. వీటితోపాటు డ్రైఫ్రూట్స్ కూడా తినే ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు బాగా అందుతాయి. వివిధ వైరస్‌లతోపాటుగా, ఇతర రోగాల భారిన పడకుండా తమను తాము కాపాడుకోవడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు డ్రై ఫ్రూట్స్‌ను తినేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా పోషక విలువలున్న బాదంపప్పు, కాజు, పిస్తా, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష, ఖర్జూర, జీడిపప్పు, అంజీర్, కటింగ్ పిస్తా, కివి, డ్రై ఫైనాపిల్, బాదం, కిస్మిస్‌లు కొనుగోలు చేస్తున్నారు. నేడు మారుమూల గ్రామాల్లో సైతం డ్రైఫుట్స్ అందుబాటులోకి వచ్చాయి.

రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలి

ప్రతిఒక్కరూ ఒక క్రమబద్ధమైన జీవిత శైలిని అలవర్చుకోవాలి. తద్వారా రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ పవర్) పెరుగుతుంది. కరోనా సమయంలోనూ, ఇతర వేవ్‌ల సమయంలోనూ వైరస్ నుండి సంరక్షించడంలో ఇమ్యూనిటీ ముఖ్య పాత్ర పోషించింది. విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవటం ద్వారా రోగనిరోధక శక్తిని బలోపేతం అవుతుంది. రోగనిరోధక శక్తి అనేక రకాల పోషకాలను కలిగి ఉంటుంది. విటమిన్ సి మాత్రమే కాకుండా మంచి ఆరోగ్యానికి అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం అవసరం. అన్ని సూక్ష్మ పోషకాలు ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటాయి. ఆహారంలో అవి తగినంతగా లేనప్పుడు రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది.

వ్యాయామం అవసరమే

ప్రతిఒక్కరూ నిద్ర, వ్యాయామం కోసం సమయం కేటాయించాలి. ఒత్తిడులకు దూరంగా ఉండాలి. ఉదయం నిద్ర లేచిన వెంటనే కాసేపు వ్యాయామం చేయాలి. సాయంత్రం పూట కూడా చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. ఫిట్‌గా ఉండటమే కాకుండా ఆరోగ్యంగా ఉంటూ చురుగ్గా రోజువారీ పనులు చేసుకోగలం.

రంగవల్లి

24 చుక్కలు 4 వరుసలు 4 వచ్చేవరకు

రాధిక,
జోహారపురం,
కర్నూలు జిల్లా.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

చిత్ర పరిశ్రమకు ప్రభుత్వాల మద్దతు కీలకం : మంచు విష్ణు



'మన కళాకారులు ఎల్లప్పుడూ అన్ని ప్రభుత్వాల ప్రజాప్రతినిధులతో అనుబంధం, సాన్నిహిత్య సంబంధాలను కల్గివుంటారు. సహకారం, సృజనాత్మకతపై మన చిత్ర పరిశ్రమ నడుస్తుంది. గతంలో వివిధ ప్రభుత్వాల మద్దతు వల్ల ఇండస్ట్రీ ఎంతో ఉన్నతస్థాయికి చేరుకుంది. ప్రత్యేకంగా తెలుగు చలన చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌లో స్థిరపడటానికి, అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం అత్యంత ముఖ్యమైంది. ఈ విధంగా ప్రతి ప్రభుత్వంలోనూ మన పరిశ్రమ ద్వారా ఎల్లప్పుడూ సత్సంబంధాలు కొనసాగిస్తూనే వస్తున్నాం. ఇటీవల జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, సభ్యులందరూ సున్నితమైన విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలను బహిరంగంగా ప్రకటించటంగానీ, వివాదాస్పద అంశాలపై నిర్ణయాలు తీసుకోవటం గానీ నివారించండి. కొన్ని సమస్యలు వ్యక్తిగతమైనవి. మరికొన్ని విషాదకరమైనవి. వాటిపై చట్టం తన దారిలో తను న్యాయం చేస్తుంది. అలాంటి అంశాలపై మాట్లాడటం వల్ల అది సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, సంబంధిత పక్షాలకు మరింత నష్టం చేస్తుంది. ఈ సమయంలో మనకు సహనం, సానుభూతి, సంఘ ఐక్యత అవసరం. తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఓ పెద్ద కుటుంబం అనే సంగతి గుర్తించుకుందాం. ఏ సమస్య వచ్చినా, మనమంతా కలిసి వాటిని సమైక్యంగా ఎదుర్కొందాం' అని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షులు మంచు విష్ణు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించి ఇటీవల జరిగిన పలు సంఘటనలను పురస్కరించుకుని ఆయన ఈ ప్రకటన చేశారు. సంధ్య థియేటర్ ఘటనతో అల్లు అర్జున్ చిక్కుల్లో పడ్డారు. కుటుంబంలో విభేదాలు రావటంతో మంచు ఫ్యామిలీలో కేసుల వరకూ గొడవలు వెళ్లాయి. దీంతో పలువురు చిత్ర పరిశ్రమ నుంచి తమ అభిప్రాయాలను సోషల్‌మీడియా వేదికగా పంచుకుంటున్నారు. మా అధ్యక్షుడిగా మంచు విష్ణు చేసిన ప్రకటనపై తాజాగా అందరూ చర్చించుకుంటున్నారు.

'అది దా సారు' అంటోన్న మేఘ ఆకాష్

మేఘా ఆకాష్ కీలక పాత్రలో 'స:కుటుంబానాం' అనే సినిమా రాబోతోంది. ఈ చిత్రంలో రామ్ కిరణ్ హీరోగా నటిస్తున్నారు. హెచ్.ఎన్.జి సినిమాస్ పతాకంపై హెచ్. మహాదేవ గౌడ, హెచ్. నగరత్న నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఉదయ్ శర్మ దర్శకుడిగా పనిచేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'అది దా సారు' అనే లిరికల్ సాంగ్‌ను నిర్మాత, ఎఫ్‌డిసీ ఛైర్మన్ దిల్ రాజు విడుదల చేశారు.

'శాంటా' నితిన్

నితిన్ తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా బుధవారం ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. పలు కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. అయితే మూవీ లవర్స్‌లో జోష్ నింపేందుకు రాబిన్ హుడ్ లుక్ ఒకటి చిత్రబృందం షేర్ చేసింది. శాంటా లుక్‌లో ఉన్న నితిన్ ఓ చిన్నారికి క్రిస్మస్ కానుకను అందిస్తున్నాడు. ఈ మూవీలో రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో పాత్రలో కనిపించబోతున్నారు.

'రెట్రో'గా సూర్య

'సూర్య44' చిత్ర టైటిల్ వచ్చేసింది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రానికి తాజాగా టైటిల్ ప్రకటించారు. ఈ సినిమాకు 'రెట్రో' అనే టైటిల్‌ని ఫిక్స్ చేస్తూ.. టీజర్ కూడా విడుదల చేశారు. లవ్, లాఫర్, వార్ అనే నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఇందులో సూర్య సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు.

3న 'ప్రేమ చరిత్ర - కృష్ణ విజయం' విడుదల

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 3న 'ప్రేమ చరిత్ర–కృష్ణ విజయం' సినిమా విడుదల కానుంది. సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం ఇదే. అంబుజా మూవీస్, రామ్ ఫిల్మ్స్ బ్యానర్స్‌పై హెచ్.మధుసూదన్ దర్శక నిర్మాతగా ఈ సినిమాను రూపొందించారు. యశ్వంత్, సుహాసిని జంటగా నటించారు. నాగబాబు, ఆలీ ముఖ్యపాత్రలు పోషించారు. ఎంఎం శ్రీలేఖ సంగీతాన్ని అందించారు. సహనిర్మాతలు బి.వెంకటేష్ శెట్టి, శ్రీపాద హను చాటే. సినిమా విడుదల సందర్భంగా చిత్ర విశేషాలను సూపర్‌స్టార్ కృష్ణ పర్సనల్ మేనేజర్ మాధవరావు, ప్రముఖ నిర్మాతలు తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, రత్నమయ్య, గీత రచయిత బిక్కి కృష్ణ, సూపర్‌స్టార్ కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఖాదర్ గోరీ, ప్రముఖ చిత్రకారిణి వాసిరెడ్డి స్పందన, ధీరజ్ అప్పాజీ, సహ నిర్మాత ఎం.శంకర్ తదితరులు వెల్లడించారు. 'ప్రేమ చరిత్ర– కృష్ణ విజయం' చిత్రం కృష్ణ నటించిన చివరి చిత్రంగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కృష్ణను అభిమానించే వారంతా ఈ సినిమాను చూడాలని కోరారు. సంక్రాంతితో కృష్ణ సినిమాలకు ఉన్న అనుబంధాన్ని వారు గుర్తుచేశారు.

ఓపెనర్‌గా రోహిత్

- నేటినుంచి బాక్సింగ్ డే టెస్టు
- ఉ. 5.00గం॥లకు ప్రారంభం

మెల్‌బోర్న్: వరుసగా రెండుసార్లు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కి అర్హత సాధించిన భారత్‌కు బాక్సింగ్ డే టెస్ట్ కీలకం కానుంది. ఆసీస్‌తో జరిగే తర్వాతి రెండు టెస్టుల్లోనూ విజయం సాధిస్తేనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కి అర్హత సాధించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో భారత్ 55.88 సగటుతో మూడో స్థానంలో ఉంది. ఇక భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ మెల్‌బోర్న్‌లో గురువారం నుంచి జరిగే బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా రెండు, మూడవ టెస్టుల్లో లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి నిరాశపరిచాడు. మెల్‌బోర్న్ టెస్టులో కేఎల్ రాహుల్ మూడవ నెంబర్‌లో బ్యాటింగ్ చేసే ఛాన్సు ఉన్నట్లు ఓ మీడియా రిపోర్టు ద్వారా తెలిసింది. కానీ శుభమన్ గిల్ బ్యాటింగ్ ఆర్డర్‌పై ఎటువంటి ప్రకటన రాలేదు. ఈ మ్యాచ్‌కు ఇద్దరు స్పిన్నర్లను దించాలని టీమిండియా భావిస్తోంది. రవీంద్ర జడేజాతో పాటు వాషింగ్టన్ సుందర్ కూడా తుది జట్టులో నిలిచే ఛాన్స్ ఉంది. అదే జరిగితే నితీశ్ రెడ్డికి మొండి చెయ్యి చూపాల్సి వస్తుంది. మరో వైపు ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ అరుదైన రికార్డుకు దగ్గరలో ఉన్నారు. మరో అయిదు వికెట్లు తీస్తే, అతను అంతర్జాతీయ క్రికెట్‌లో ఏడు వందల వికెట్లు తీసిన ఆసీస్ బౌలర్ల జాబితాలో చేరుతాడు. షేన్ వార్న్(1001 వికెట్లు), గ్లెన్ మెక్‌గ్రాత్(949), బ్రెట్ లీ(718) టాప్–3లో ఉన్నారు. స్టార్క్ ప్రస్తుతం 284 అంతర్జాతీయ మ్యాచుల్లో 695 వికెట్లు తీసుకున్నాడు. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఇప్పటివరకు జరిగిన తొలి మూడు టెస్టులు ముగిసేసరికి ఇరుజట్లు చెరో టెస్ట్ మ్యాచ్ గెలిచి 1–1తో సమఉజ్జీలుగా ఉన్నాయి.

టీమిండియాకు చివరి అవకాశం

ఈ సిరీస్ ఆరంభానికి ముందు న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 0–2తో వైట్‌వాష్ భారత్‌కు తొలిసారి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ స్థానాన్ని జారవిడుచుకునే ప్రమాదంలో పడింది. 2019–21 సీజన్ ఫైనల్లో భారత్ న్యూజిలాండ్ చేతిలో ఎనిమిది వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. తర్వాత 2021–23 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడిన భారత్ 209 పరుగుల తేడాతో వరుసగా రెండోసారి పరాజయం చవిచూసింది. ఈ నేపథ్యంలో ఈసారి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కి అర్హత సాధించాలని భారత్ చాలా గట్టి పట్టుదలతో ఉంది. ఇందుకు ఈ రెండు టెస్టులలో విజయం సాధించడం ఒక్కటే భారత్ ముందున్న అవకాశం.

ఆస్ట్రేలియాకు కీలకమే..

డబ్ల్యుటిసి ఫైనల్‌కు బెర్త్ ఖాయం చేసుకోవాలంటే ఆస్ట్రేలియాకు ఈ టెస్ట్‌లో గెలుపు తప్పనిసరి. ప్రస్తుత 2023–25 సీజన్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పట్టికలో దక్షిణాఫ్రికా ప్రథమ స్థానంలో ఉంది. శ్రీలంకతో సొంత గడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో 2–0 తేడాతో విజయం సాధించిన దక్షిణాఫ్రికా, పాయింట్ల పట్టికలో 63.33 సగటుతో అగ్ర స్థానానికి దూసుకుపోయింది. ఆస్ట్రేలియా ప్రస్తుతం 58.89 సగటుతో రెండో స్థానంలో ఉంది. భారత్‌తో చివరి రెండు టెస్ట్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ఆసీస్.. శ్రీలంకలో పర్యటించనుంది. ఆ దేశంలో మరో రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో ఆడాల్సి ఉంది. అయితే ఆస్ట్రేలియాకి శ్రీలంకని స్పిన్‌కి అనుకూలంగా ఉండే అక్కడ పిచ్‌లపై శ్రీ లంక ని ఓడించడం అంత సులువైన పని కాదు. అందుకే ఆస్ట్రేలియా కూడా ఈ రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించి తన అవకాశాలని సుస్థిరం చేసుకోవాలని భావిస్తోంది.

జట్లు(అంచనా)...

భారత్: రోహిత్(కెప్టెన్), జైస్వాల్, కెఎల్ రాహుల్, కోహ్లి, పంత్(వికెట్ కీపర్), నితీశ్ కుమార్/సుందర్, సిరాజ్, బుమ్రా, ఆకాశ్ దీప్, పడిక్కల్/హర్షిత్ రాణా.

ఆస్ట్రేలియా: కమిన్స్(కెప్టెన్), ఖవాజా, కోన్‌స్టాస్, ట్రవిస్ హెడ్, లబూషేన్, స్మిత్, మిచెల్ మార్ష్, క్యారీ(వికెట్ కీపర్), స్టార్క్, లియాన్, అబాట్/రిచర్డ్సన్.

టాప్‌లోనే బుమ్రా

ఐసిసి టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. ఐసిసి బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో బుమ్రా 904పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్టులో అద్భుతమైన ప్రదర్శన కనబరచడంతో బుమ్రా తన రేటింగ్ పాయింట్లను మరింత మెరుగు పరుచుకున్నాడు. బుమ్రా తన కెరీర్‌లో 900కు పైగా టెస్టు రేటింగ్ పాయింట్లు సాధించడం ఇదే తొలిసారి. తద్వారా జస్ప్రీత్ ఓ అరుదైన ఫీట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఐసిసి టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన భారత బౌలర్‌గా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రికార్డును బుమ్రా సమం చేశాడు. 2016లో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ తర్వాత అశ్విన్ 904 పాయింట్ల టెస్టు రేటింగ్ పాయింట్లను సాధించాడు. మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత బుమ్రా ఈ ఫీట్‌ను సాధించాడు. ఓవరాల్‌గా టెస్టు ర్యాకింగ్స్‌లో 900 పాయింట్లు దాటిన 26వ ఆటగాడిగా బుమ్రా నిలిచాడు. ఇక తాజా ఐసిసి టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో బుమ్రా తర్వాత కగిసో రబాడ(856), జోష్ హాజిల్‌వుడ్(852) వరుసగా రెండు మూడు స్థానాల్లో ఉన్నారు.

బాబర్‌కు చోటు

దక్షిణాఫ్రికాతో తొలిటెస్ట్ నేడు

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న పాకిస్తాన్ జట్టుకు అద్భుత ప్రదర్శనతో అదరగొడుతోంది. టి20, వన్డే సిరీస్‌లను గెలిచిన ఉత్సాహంతో సఫారీలతో టెస్ట్ సిరీస్‌కు సిద్ధమైంది. ఈ క్రమంలో ఆ జట్టు స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ దక్షిణాఫ్రికాతో జరిగే తొలి టెస్ట్‌కు అందుబాటులోకి వచ్చాడు. దక్షిణాఫ్రికాతో గురువారం నుంచి జరిగే తొలిటెస్ట్‌లో అతడికి చోటు దక్కింది. సెంచూరియన్ వేదికగా జరిగే ఈ టెస్ట్‌లో ఆడే పాకిస్తాన్ జట్టును ఆ దేశ క్రికెట్‌బోర్డు ప్రకటించింది. తొలిటెస్ట్‌కు పాక్ కెప్టెన్‌గా షాన్ మసూద్ ఎంపికయ్యాడు. అతడు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ సిరీస్ అనంతరం విశ్రాంతి తీసుకున్నాడు. పాకిస్తాన్ జట్టు స్వదేశంలో ఇంగ్లండ్‌పై 2–1తో టెస్ట్ సిరీస్‌ను నెగ్గి బంగ్లాదేశ్ చేతిలో 0–2తో ఓటమిపాలైంది. ఇక పాకిస్తాన్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య కేప్‌టౌన్ వేదికగా జనవరి 3 నుంచి రెండో, చివరి టెస్ట్ ప్రారంభం కానుంది.

జట్టు: షాన్ మసూద్(కెప్టెన్), ఆయుబ్, బాబర్, గులామ్, రిజ్వాన్(వికెట్ కీపర్), షాద్ షకీల్(వైస్ కెప్టెన్), అఘా లీ, అమీర్ జమాల్, నసీమ్ షా, షహజాద్, అబ్బాస్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68